# ఆరుగురు కథకులూ - ఒక నాయిక

అసలు ఈ గొడవకంతటికీ కారణం కనకం. నేనంతవరకూ కనకాన్ని గురించి పట్టించుకోలేదు. బాగా పరీక్షగా చూళ్ళేదు కూడా. ఆ క్షణంలో ఆమెను రైలు పెట్టెలోంచి తోసివేద్దామన్నంత కోపం వచ్చింది. ఆమె నొక్కదాన్నే కాకుండా, అసలు స్త్రీజాతంటేనే శాశ్వతమైన ద్వేషం రేగిన క్షణం అది. మనం బాగా ఎరగని వాళ్ళని ఎందుకు ద్వేషిస్తామో ఇప్పటికీ అర్థంకాదు. వాళ్ళు మనకంటె ధనికులా, హోదాగలవారా, అందమైనవాళ్ళా, తెలివైనవాళ్ళా, బలవంతులా? ఏమో తెలియదు. వేటిల్లో మనకంటె అధికులో తెలియక, వారిని మనస్సులో దూరంగా వుంచేసి, వారికేసి చూడక, వారిని గురించి జరిగే దుష్ప్రచారం ఏదన్నా ఉంటే, దానికి మనం కూడా తోడ్పడతామా! ప్రేమకి కారణాలుండవు. ప్రేమ గుడ్డిదందంటారు. ద్వేషానికీ కారణాలుండవు. అది గుడ్డిదీ, చెవిటిదీ కూడా.

కళ్ళు బాగా తెరిచి చూచాను కనకాన్ని. కోలమొహం, చంద్రబింబంతో సరిపోల్చే గుండ్రనైన స్త్రీ మొహంలో చక్కదనం, ప్రశంస తరతరాలుగా సాగడంవల్ల కాబోలు, నాకు కోల మొహం గిట్టదు. కోలగా సాగారి, కంటికింద గీటువల్ల కాబోలు విశాలంగా కనబడేకళ్ళు—పలకరించి, తబ్బిబ్బుచేసి, బంధించివేసే పెద్ద కళ్ళు నా కసలే గిట్టవు. మధ్యాహ్నపు ఎండలో బారుగా ఎగిరే తెల్ల జండాలమల్లే ప్రస్ఫుటంగా మెరిసే పళ్ళవరస, ఎర్రమందారాలతో మలిచిన విల్లుకిమల్లే నోరు, అసలు వంకర లేకుండా కట్టించుకున్న పళ్ళవరసలా, ధగధగమెరిసే పళ్ళంటే భయం, ఎర్ర మందారంలో కాస్తంత నలుపు ఛాయ, యముడు మొహాన బొట్టుకి మల్లే—ఆ రకం నోరంటే యావగింపు. ఆమె ఎత్తరి. సామాన్యమైన ఎత్తుగల స్త్రీలనే ఎరుగుండి, ఎత్తయిన వాళ్ళంటే దూరంగా ఉండ బుద్ధేస్తుంది. పాపిడి కనబడక, చిందర వందరగా రేగిన తల,జుట్టు—ఏమిటో

అడవిలో రేగిన తేనేపట్టుకుమలే—సంసారంపట్ల వైరం ప్రదర్శించే వైఖరి జడంటే హడలు; ఇంక నడుం ఒంపులు, రొమ్ములులేచి పడడాలు మెడకింద నీడ తళుక్కు, భుజాల గుండ్రతనం మొదలైనవాటి మాటం టారా, కొట్టొచ్చినట్లు, మాంసంకొండ విరిగిమీద పడ్డట్లు—చుట్టుపక్కల ఉండను, పారిపోతాను. అసలు కనకం అన్న పేరే గిట్టదునాకు. బంగారు పసిమిచాయ కాదు. శీతాకాలంలో పొట్టు రేగినట్లు కనబడే చర్మం, వర్షాన్ని కర్చుచేసుగుని కదలలేని ముసిలిమేఘంలో మసలే చామనఛాయ నీడ కళే బరం—రోతస్మాండి !

ద్వేషం, చెవిటిది కూడా అన్నాను. ఈసారి ఆమె చెపుతున్నది శ్రద్ధగా విన్నాను. ఆవిడ కంఠాన్ని వర్ణించలేను. అవతలవాడి కంఠంలో జొరబడి, వాడుచేసే ధ్వనితో జోడై సాగించిన బృందగానంలో జీరలాగా నలుగు రైదుగురు జోరుగా తిట్టుకుంటూ ఉంటే బైటపడే గొడవలోని రోదనలాగా, హాస్పిటల్ వార్డు మొత్తం ఒక్కసారి మూలిగినట్లుగా—యవ్వనంలోని మాధుర్యం, నాజూకు, లాలన, సిగ్గు బిడియాలకు విడాకు లిచ్చి, విచ్చలవిడిగా పేట్రేగిపోయిన నడివయస్కుల ఏకాంత నైతిక నిద్రకి మేలుకొలుపులాంటి కంఠం, కనకం వయస్సు; ముప్పైఅయిదు? ఆరు, ఏడు...... నలభై, నలభైలోపా? ఏమో, భారతావని జనాభాలో సగం వంతు స్త్రీలయితే, వారిలో ముప్పైదాటని స్త్రీల సంఖ్య ఎంతో జనాభా లెక్కలవల్ల తేల్చేవరకూ కనకం వయస్సు నలభై దాటదు. నాకు దగ్గరగా జరిగి కూర్చున్నప్పుడు—నాకు ముప్పై లోపే గావున—తనకి అంతకంటె ఎక్కువ వయస్సుండదని దగా చేసుకున్న క్షణాలు లేకపోలేదనుకోండి. తనుతెచ్చిపెట్టిన గొడవ చెప్పేముందు,ఆవిడ అలవాట్లను కొన్నింటిని వివరించకుండా ఉండలేను. మా థర్డుక్లాస్ టూరిస్టు పెట్టిలో, యాత్రాధిపతి విశ్వపతి, వంటాయన విఠలయ్య, నౌకర్—అన కూడదు, ఎటెండెంట్ అనాలి కాబోలు—సరే ఎటెండెంటు జాలయ్యతో, ఇరవై ఇద్దరం వున్నాం. సీటుకి ఇద్దరేసి. కనకం సీటు తొమ్మిదోది—ఆమె ప్రక్కన ప్రెసిడెంట్ రాఘవయ్యగారి చెల్లెలు శ్యామల కూర్చోవాలి

నా సీటు పదిహేడవది. అదేంచిత్రమో, తన సీటులో కూర్చోలేదు కన కం. ఏ సీటు ఖాళీగా కనబడితే అందులోకూర్చుని, పక్కవాడితో కబుర్లు మొదలెడుతుంది. నా పక్కన పద్మనాభం. అతనికి తిరుగుడు జబ్బు—తిరుగుతూ ఉంటాడు. అది చూసుకుని, కనకం పక్కనచేరి, రైలు కుదిపి నప్పుడల్లా అంగుళం చొప్పున దగ్గరకి జరుగుతూ, మొహంలో మొహం పెట్టి, వాగుతూ రోత పుట్టించే ఒక అలవాటుంది. ఆమెకి ఆడ, మగ, పెద్ద, చిన్న వివక్షతల జిజ్ఞాసే లేనట్లుంది. మూడో నెంబరు సీట్లో ధనం జయంగారని—ఒక వృద్ధుడు, భక్తుడు పురాణ కాలక్షేపం చేస్తూ, సమాధిలోపడి పరమాత్మని సందర్శిస్తూ ఉన్న పవిత్ర సమయంలో ఈమె, పక్కనజేరి, తనూ తన్మయం పొందినట్లు కాలక్షేపంలో తన కంఠం జోడించి, ఆ భక్తాగ్రేసరుణ్ని, శిఖరాన్నుండి కింద లోయలోకిలాగి,ధ్వంస మైన ఆధ్యాత్మికానుభూతి కళేబరంపై నాట్యం చేస్తుందంటే అతిశయోక్తిగా తోచవచ్చు. అది యథార్థాన్ని అగ్నిసాక్షిగా పెండ్లాడిన అతిశయోక్తి. పేషంట్లనుండి పారిపోయి పుణ్యక్షేత్రాలు దర్శించి, మనశ్శాంతిని సమకూర్చుకుందాం అని బైలుదేరిన డాక్టర్ నాగభూషణంగారికి బోలెడు పని కల్పిస్తుంది. చెయ్యి చూడమంటుంది. రెప్పలు పైకితోసి కళ్ళుచూడమం టుంది. పళ్ళు, చిగుళ్ళు చూసి, "మరేం పేచీలేదుగదా" అంటుంది. ఆమెకి గుండెలో నెప్పి, పోట్లు — భోజనానంతరం జీర్ణకోశం నుండి కూతలు, పిలుపులు. పాపం నాగభూషణం తీరిక దొరికినప్పుడల్లా అవి దకిలేని జబ్బులేవో తెలుసుకోవడంలో నిమగ్నుడై ఉంటాడు. ఆయన భార్య విజయ సిగ్గుపడి, అదోలాగయ్యేది. కాని, కనకం, వారి సంతానం "రవి" (కుర్రాడు), "రమ" (అమ్మాయి)లను సముదాయిస్తుంది గావున, ఆమె ఏమీ అనలేక పెట్టెలో తోటి యాత్రికులు చూపుల్లో కనబరచే సానుభూతితో తృప్తిపడేది. మద్రాసు దాటిం తర్వాత, కనకం వైఖరిలో మరింత తెగింపు, స్వేచ్ఛ కనబడసాగాయి. వీపుకి బొత్తాములున్న జాకెట్ రెడీమేడ్ది కొంది కాబోలు పట్నంలో—

రక్షితలాల్‌కి, ఆయన భార్య రాజీబాయికి మధ్యలో నిలబడి, బొత్తాములు బిగించమనేది- ఎవర్ని ఉద్దేశించో ఎవరికీ అర్థంకాక బిక్కమొహంతో తోటివారికేసి చూసేవారు. చెట్టిగారి భార్య చిట్టెమ్మ గ్రహించి, తనే బొత్తముల్ని సరిచేసి, ఒక అవాంతరాన్ని తప్పించి, అందరి మన్ననలకూ పాత్రురాలైంది. లక్ష్మణమూర్తి— పెట్టెలో మాకు కాస్తంత దగ్గర- సాహిత్య ప్రియుడు, కవి, ఏవేవో పాడుకుంటూ ఉంటాడు. ప్రేరణకోసం అన్నట్లు, అల్లా తేరిబారి చూసినప్పుడు, కనకం అటు వెళ్ళి, అతని దృష్టిని అరికట్టి, తనవైపుకి తిప్పుకుని- "నామీద అల్లండి-ఎన్ని కావ్యాలైనా తట్టుకోగలను" అన్నట్లు ఒక సవాల్‌చూపు, దృశ్యం ప్రదర్శించి, ఆ కవిపుంగవుణ్ణి, వూహా జగత్తులోంచి ఒక్కతోపుతో స్థూల జగత్తులోకి తోసేస్తుంది. ఇది కొందరు మొదట్లో హర్షించినా, మానవుడి ప్రాథమిక హక్కులపై ఆమె సలుపుతున్న దాడిని గుసగుసల ద్వారా ఖండించడం లేకపోలేదు.

మా దక్షిణ యాత్రా టూరిస్టుపెట్టె బైలుదేరిన ఐదారు రోజుల వరకూ మేం ఒకర్ని ఒకరు తెలుసుకుని, తెగలకిందా, బృందాలకిందా విడిపోయి, ప్రతివారూ వారివారి అంతస్తులు, పొలిమేరలు నిర్ణయించుకుని, స్థిమితమైన దృక్పథంతో మసలుకోడం జరగలేదు. పెట్టిముందుభాగంలో వారందరూ ఉత్తరాదివారు, మేం దక్షిణాదివారం. మధ్యలో బోర్డర్- సరిహద్దు ప్రాంతంవారు. చూడవల్సిన చోట దర్జాగా ఖర్చుచేసి సౌకర్యాలు కూర్చుకునేవారు ఒక బృందం. అగ్రిమెంటు ప్రకారం అనుకున్నదానికి మించి నయాపైసా రాల్చనివారు ఒక కూటమి. మా టూర్ ఏర్పాటు చేసిన విశ్వపతి టైమ్‌టేబిల్ ప్రకారం బైట కెళ్ళడానికి ఐదు నిముషాల్లో సిద్ధం అవగలవారంతా ఒక గుంపు, తెమలక, బద్ధకించి, "నేను హాయిగా పడుకుంటా- మీరు చూసి బావుకురండి- ఏముంది ఆలయాలన్నీ ఒకటేగా- అక్కడుండే దేముడే ఇక్కడున్నాడు" అని పెట్టెలో దిగడి బొయ్యేవారు ఒక అల్ప సంఖ్యాకుల మండలి. ఆయన్ని ప్రెసిడెంటు అని ఎందుకు వ్యవహరిస్తున్నారో నే నెరుగను- ఈ మండలికి నాయకుడనొచ్చు రాఘు

వయ్యగారిని. కాని, వారిభార్య సుందరం, చెల్లెలు శ్యామల, ప్రతి వింతా చూడ్డానికి వస్తూంటారు. ఈవిధంగా వారం సాఫీగా సాగిపోయింది మా ప్రయాణం—కనకం కొత్తగొడవ తెచ్చిపెట్టేవరకూ అన్నమాట.

మొదట, రెండు, మూడు రోజులూ కనకం మధ్య మధ్య మా పెట్టెలో లేదన్న విషయం నేను గమనించలేదు. ఆవిడ లేకపోతే స్వేచ్ఛగా గాలిపీల్చేవారున్నా, వాళ్ళు మళ్ళా సజీవులై ఉన్నామని ఋజువు చేసుకోడానికి ఆవిడ కావల్సివచ్చేది. రైలు కుదుపుకి పత్రిక చదవడం యజ్ఞంగా ఉండేది నాకు. కిటికీ అవతల కదిలిపొయ్యే దృశ్యాన్ని ఎంత సేపు చూడటం—? పురిటికి పుట్టింటికి వెళ్ళిన మా ఆవిణ్ణి గురించి ఎంత సేపు ఆలోచించడం? మొదటికాన్పు—అదుర్దాగా ఉండేది, అట్లా ఆమెని విడిచేసి నే నిట్లా యాత్రకి బైలుదేరడం ఏమిటని మనస్సు పీకడమూ ఉండేది. ఇదంతా అస్పష్టమైన మానసిక బాధ- ఎవరితోనో చెప్పుకోవాలి— ఇందుకు తగ్గవారు మా పెట్టెలో లేరనిపించింది. దిగమింగుకున్నదంతా గడ్డకట్టి, ద్వేషంగా ఘనీభవించింది. దీన్ని బైటికి కక్కివెయ్యడానికి కనకం దొరికింది. ఆవిడ వైఖరి, చేష్టలు, మాటలు, కసిగాచూసి, ద్వేషింపతగ్గ లక్షణాలు ఎన్నిఉన్నాయో లెక్కించుకుంటూ గడపడంలో కొంత రహస్యమైన సడలింపు కనబడేదనే ఒప్పుకోవాలి. ఆ కనుబొమ్మ లెగరెయ్యడం, పెదవుల ఒంకర్లు, చేతివేళ్ళు బిగించి, జబ్బలు పైకి ఎగర వేస్తూ, కాళ్ళు కదుపుతూ అవన్నీ- ఎంత ఘోరంగా ఉన్నాయో తిలకించ డంలో ఆనందం. పమిట దిగలాగి మళ్ళా పైకి లాగుతూంటుంది. ఆ వక్షంలో బింకంలేదు-కాని, ఉన్నట్లు కనబడాలని ఆమె తీసుకునే జాగ్ర త్తని తిలకిస్తే, ఆవేదన తగ్గినట్లుగా వుంటుంది.

ఆస్థితిలో కనకం కనబడదేం చెప్మా అనుకుంటూండగా రైలు నిలిచింది. ఇంజిన్ కాసేపు చెడుగుడు ఆడి, మా పెట్టెని దూరంగా ప్లాట్ ఫారం అవతల సైడింగ్‌లో దిగవిడిచి చక్కాపోయింది. మా టూరిస్టుకార్ కావల్సినచోట ఆగిపోతుంది. అక్కడ చూడవల్సినవన్నీ ప్రోగ్రాం ప్రకారం చూశాక, ఏ రైలు వెడుతుంటే ఆ రైలుకి తగల్చబడుతుంది. ఆ రైళ్ళ రాకపోకలు ఒక చట్టప్రకారం నిర్ణీతమైనా, అవి అలస్యం అవ

డంవల్ల మా పెట్టెలో జనం, ఆ సమయానికి గుమిగూడక పోవడంవల్ల ప్రోగ్రాం తారుమారై, ఆర్గనైజర్ విశ్వపతిగారిమీద అందరం ఒక్కసారి విరుచుకుపడటం, మా యాత్రా విశేషాలలో ప్రధానమైంది.

చీకటి పడుతోంది. చెట్లు, ఆకాశం చీకటి మోహాల ముసుగులో తలదూర్చుకుంటున్నాయి. పక్షులు వోపికలేక, రెక్కలని శ్రమతో వూపుకుంటూ, చెట్టుకొమ్మలు చేరుకుంటున్నాయి. చీకు చింత లేక సాగిపోయిన రైలుపట్టాలుతప్ప చీకటి కాంత ప్రకృతి మెడచుట్టూ పెనవేసుకుని, దిగులుగా తనలోకి లాక్కుంటోంది.

"కనకం కనబడదేం" అన్నారెవరో.

"నాకు వెయ్యేళ్లాయిష్షు- మీరంతా అంతకాలం వోర్చుకోగలిగితే" అంటూ పెట్టెలోకి ప్రవేశించింది.

కనకం పెట్టెలో చీకటిగా ఉంది. ఆమె బ్యాటరీలైట్ వెలుగు నలుమూలలావేసి మాట్లాడుతూంది.

"మన థర్డుక్లాస్ మొహాలకి లైట్లు కూడానా-ఈ లైట్ ఆ పక్క ఫస్టుక్లాస్ కారేజ్‌లో కృష్ణమూర్తిది. వాళ్ళ కారేజ్‌లో దీపాలున్నాయి. ఇంకా మధుసూదనం అని-పాత స్నేహితుడులెండి-ఆయనా, భార్యా, వాళ్ళ బేబి....హాయిగా సోఫాలమీద, ఫ్యానుక్రింద, లైట్లేసుకుని చదువుకుంటున్నారు."

కనకం ఈ ముక్కలు చెబుతుండగానే మేమంతా పెట్టెలోంచి దిగి మా పెట్టె వెనకాల తగిల్చిన మరో టూరిస్టుకార్ చూశాం. అది చిన్న పెట్టె. ఫస్టుక్లాస్ సదుపాయాలు, హంగులు గల పెట్టె. అందులో కిటికీలోంచి లైట్ల వెలుగు నేలమీద పడుతోంది. మద్రాసులో తగిల్చారో, మరి ఏ మరోమధ్య స్టేషన్లో తగిల్చారో నాకు తెలియదు. విశ్వపతిని కేకేసి అడిగాడు. రక్షితలాల్, ఆ లైట్లు మా పెట్టెలో ఎందుకు పెట్టించకూడదని అతను బిక్కమొహం వేశాడు. ఆ రెండోపెట్టెలో యాత్రికులు ఫస్టుక్లాస్ ప్రయాణీకులట. ఎక్కువ డబ్బు ఇచ్చారుట. అందుచేత, దానికుండవల్సిన సౌకర్యాలు, హంగులూ సమకూరాయిట. ఇంజన్ లేకపోయినా, బ్యాటరీలు చార్జ్ చేయించి ఫాన్లు, లైట్లు పనిచేసే సదుపాయం కల్పించాడుట,

వారి పెట్టె కంట్రాక్టరైన గౌరీపతి—తన అన్నగారుట.

"ఏడీ, ఇల్లా పిలవండి, ఆయన్నే అడుగుతాం" అన్నాడు రాఘవయ్య.

"మా అన్న తను దిగడి, ఆ పెట్టె వ్యవహారం కూడా నన్నే చూసుకోమన్నాడు." అన్నాడు విశ్వపతి.

"ఆ బ్యాటరీ ఏమిటో తీగల్లో కెక్కించి, ఈ పెట్టెలో కూడా కాస్త లైట్లు ఏర్పాటు చేయించండి" అన్నాడు లక్ష్మణమూర్తి.

"అది వీలుపడదండి—"

"ఏం, ఎందుకు వీలుపడదూ?"

"రైల్వేవాళ్ళు ఒప్పుగోరు-బోలెడు డబ్బవుతుంది" దాంతో మా వాళ్ళ జోరు తగ్గింది.

రిటైర్డ్ శానిటరీ ఇన్స్పెక్టర్ చౌదరిగారు, "ఆమాత్రం డబ్బు మేమూ ఇచ్చుకోగలం" అని మొదలెట్టగానే, ఫస్ట్‌క్లాస్ కారేజ్‌లో అలజడి బైలుదేరింది. తలుపుతీసి ముగ్గురు వ్యక్తులు దిగారు. అందులో ఒకాయన మా పెట్టెకేసివచ్చి, "కనకంగారూ" అనిపిల్చాడు. ఆమె బైటకొచ్చింది. "రండి వెడదాం" అన్నాడు. "నిమిషంలో" అని లోపలికెళ్ళి పది నిమిషాల తర్వాత వూడిపడింది, మఫ్లర్‌లాంటిది నెత్తిని కప్పుకుని.

"నా ఫ్రెండ్స్ వారే. మధుసూధనం-ఆయన కృష్ణమూర్తి—వెనకాల ఇందిర-ఆయనభార్య. ఆ ముందామె, జేబీ నెత్తుకుందే-ఆమె హేమలత మధుభార్య........వస్తా" అని మెల్లగా అంటూ నా ముందునుంచి నడిచి వారిని చేరింది. వారు మెల్లగా నడుచుకుంటూ, ఫర్లాంగు వెళ్ళారు-అక్కడ రోడ్డు. ఏదో కారాగింది. అందులో ఎక్కి వెళ్ళారు. కనకం అంటె అందుకే మా కోపం. పెట్టెలో వారందరి కోపమూ నా ఒక్కడిలో వ్యక్తమైందంటే ఆ కోపాన్ని ద్వేషం అనొచ్చు.

"చూడండి వాళ్ళెంత పెద్ద మనుషులో. లైట్లు ఆర్పకుండా వెళ్లారు. వంటకి పూనుకో విఠలయ్యా" అన్నాడు విశ్వపతి.

"మేం పెద్ద మనుషులం కామనా?" అన్నాడు రక్షితలాల్.

"ఎంతమాట. వారు బైటికి వెడుతున్నప్పుడు తలుపు తాళం వేసు

వచ్చింది. నన్ను ఎందుకు లేపినట్లు. ఎందుకిట్లా తీసుకొచ్చినట్లు! అట్లా నడుస్తూ కొంతదూరం వెళ్ళాం. నక్షత్రాలు స్వచ్ఛంగా మెరుస్తున్నాయి— చలికి వణుకుతున్నట్లుగా. పల్చటి నల్లరంగు చీరలోంచి స్త్రీ శరీరం కన బడ్డట్లు ప్రకృతి అస్పష్టమైన కాంతితో, గాలి వీచినప్పుడల్లా పక్కకి తిరిగి పడుకుంటున్నట్లు. చలించినప్పుడు తప్ప, అంతటా నిశ్శబ్దంగా, ప్రశాం తంగా ఉంది.

"వాళ్ళ స్నేహితులెవరికో ముందుగా వ్రాశాట్ట మధుసూధనం-కారు తీసుకొచ్చారు. భోజనాలకెళ్ళి చక్కా వచ్చాం" అంటోంది కనకం.

"ఏమైతే, మహా. ఎందుకు నన్ను లేపడం?"

"వాళ్ళ పెట్టెలోనే పడుకోమన్నారు. అందులో ఆరు సీట్లట. ప్రస్తుతం, వాళ్ళు నలుగురు "బేబీ" అంతే-రెండు సీట్లు ఖాళీ........

"రేపు తెల్లారంగానే తీసుకెడతా, రా— వాళ్ళెంత మంచివారను కున్నావు. మధు భార్య హేమ, మనిషి మంచిదనుకో, కాని, అదోకలా గుంటుంది. మొగుడి చక్కదనం ఎక్కడ, తనెక్కడ! ఇంక ఇందిర— కృష్ణమూర్తి పెళ్లాం-చాలా అమాయకురాలు. నన్ను అక్కడే ఉండి పొమ్మని బలవంతం చేసింది........ఆ జోడాలమధ్య పుల్లలా నే నెందుకని వచ్చేశాలే...."

"సరె, ఇదంతా ఎందుకు చెబుతున్నట్లు——?"

"నీకు నిద్రట్టదు-నాకూ నిద్రట్టదు"

"అంటె?"

"ఇన్నాళ్లూ ఒంటిగా ఉంటంమూలాన, మనుషులతో చెప్పుకోడం అంటె సర్దా. చలిగాఉందా-? పద వెనక్కి పోదాంలే" వెనక్కి తిరిగింది కనకం. నేనూ తిరిగాను.

"ఒంటిగా ఉండటంఅంటె? మొగుడు, పిల్లలూ, సంసారం........ లేవూ....?"

"అయ్యోరాత. అవన్నిఉంటే ఇంకనేం. ఇట్లా నీతో వస్తానూ? పెండ్లయిన వాలకమే నీది. అవునా?"

"ఉ" అన్నట్లు తలపంకించాను.

"పెండ్లాందగ్గరలేదు గనక, మంచివాడివి గనక, ఇట్లా రమ్మనంగానే వచ్చావు పాపం....."

ఆవిడ జీవితంలో ఎన్ని పాపాలు చేసిందో నే నెరుగనుగాని, ఆవిడ సంభాషణలో చాలా పాపాలు దొర్లుతాయి. అదొక అలవాటు. వాటిని వ్యాఖ్యానిస్తూ, బుర్రపాడు చేసుకోనక్కరలేదు.

"ఎందుకులేవు-భర్త చనిపోయ్యాడా?" నవ్వుతోంది కనకం—బాగా నోరంతా విప్పి-తెల్లజండాలు గాలిలో ఎగిరినట్లు.

"మళ్ళా తిరిగొస్తాడని భయం ఉన్నట్లు అడుగుతావేం. మొగుడుతో కాపరం చేసే మొహమేనా నాది?"

"ఏమో, మొహంలో అవన్నీ తెలుస్తా యేమిటి?"

"పోనీలే, సంసారినిచేసి, నా పరువు ప్రతిష్ఠలు నిలబెట్టావు, పాపం. అదే పదివేలు.

"ఇంక వెళ్ళి కప్పుకు పడుకో" అంది. పెట్టె దగ్గరకి చేరుకున్నాం.

"నువ్వో?" అన్నాను.

"నక్షత్రాలని చూస్తుఉంటాను. కోపమా? చలా? కొంగు కప్పేదా?"

"ఛా, ఛా జబ్బు చేస్తుంది, నువ్వూవచ్చి పడుకో" అన్నాను.

"నామీద అంత దయెందుకో"

"నీతో ఏదన్నా ప్రమాదమే. నే పోతా" అన్నానేకాని, చటుక్కున ఆమెని దిగవిడిచి వెళ్ళలేకపొయ్యాను.

"ఈ ఒక్కమాటా విను"

దగ్గరగా వెళ్ళాను.

"ఏమిటో చెప్పరాదూ?"

"మీఆవిడ ఆడపిల్లని కనబోతోంది" అని నవ్వుతోంది.

"వెళ్ళు" అని విసుక్కుని, పెట్టెలోకివెళ్ళి, ముసుగుతన్ని పరున్నాను. తన సీట్లోకెళ్ళి పడుకుంది కనకం.

ఫస్టుక్లాస్ ప్రయాణీకులతో చిదంబరంలో పరిచయం ఏర్పడింది. మా పెట్టెలో జనం బండ్లమీద బైలుదేరారు. నేను, లక్ష్మణమూర్తి, కనకం, నాగభూషణంగారి కుటుంబం పక్కపెట్టెలో మధుసూధనం

హేమలత, కృష్ణమూర్తి అతనిభార్య ఇందిర ఒక గైడ్ కుతంత్రానికి లొంగి, రెండు కార్లలో వూరంతా చూసి, ఆలయం సందర్శించాం. కృష్ణమూర్తి ప్లీడరు, చరిత్ర చదివినవాడట. అక్కడ శిల్పాల సౌందర్యం గురించి విపులంగా చెప్పడం సాగించాడు. ముప్పై రెండెకరాల ఆవరణలో ఉంది నటరాజస్వామి ఆలయం. అంతటా చెక్కడాలతో నిండిన సభలూ, విహారాలూ, ఆరామాలు. ఆలయం లోపలి ప్రాకారంలో నాలుగు గోపురాలున్నాయి-రెండింటి పైన నూటఎనిమిది నృత్య భంగిమలు చెక్కబడి ఉన్నాయి. చోళ, పాండ్యరాజులు సాధించిన విజయాల స్మారక చిహ్నలుగా మూడువందల అడుగుల పొడవు, నూటయాభై అడుగుల వెడల్పు గలిగి, వెయ్యి స్తంభాలతో నిండిన రాజసభని చూశాం. నటరాజమూర్తి కనకసభలో ఉంటుంది. ఈ మూర్తి సౌందర్యానికి తన్మయులైన శిల్పులు, వందలాదిగా నృత్యసభలో చెక్కిన నాట్య భంగిమాల నకళ్ళుచూస్తూ, అక్కడే నిలబడిపొయ్యాం, నేను, కృష్ణమూర్తి, కనకం. ఒక శిల్పం ముందు మేం నిలబడి ఉండగా ఫోటో తీశాడు మధుసూధనం. కనకం, ఒక శిల్పం నడుం పక్కన తన మొహం కనబడేటట్లు నిలబడి, రెండో వైపుకి మధుసూధనాన్ని వచ్చి నిలబడమంది. నన్ను ఫోటో తియ్యమంది. "మీరూ రండి" అని హేమలతని పిలిచాను. ఆవిడ అయిష్టంగా తల వూపి, బేబీతో దూరంగా వెళ్ళింది. ఇట్లాంటి సందర్భాలలో ఎల్లా సముదాయించాలో నాకు అనుభవంలేదు. రాపిడికి చెదిరిపోయిన ఆ రాతి శిల్పాలలో కనకం కలిసిపోయినట్లుంది. ఆమె మొహం చర్మమూ రేగి రాలుతోన్నట్లుంది. దుస్తులు వేసుకునే ఆచారం మంచిదే. అందువల్లనే, అవి లేకుండా నగ్నంగావున్న శరీరం ఎట్లా ఉంటుందో వూహించుగునే అవకాశం ఏర్పడింది. ఆమెది ఎంత స్థూలమైన కాయమో, ఎంత ఎత్తయినదో శిల్పాలమధ్య తెలిసొచ్చింది.

వాళ్ళంతా ముందుగా నడుస్తున్నారు. కెమెరా పరికరాలు మూసివేసి, మధుసూధనాని కందిచ్చి, అక్కడ అల్లిక బుట్టల కొట్టు చూస్తూ నిలబడ్డాను. వెనకలే వచ్చింది కనకం.

"చూశావా హేమలతని"

ఉలిక్కిపడ్డాను.

"మధుకి తగిందేనా?"

"ఏమో-ఎవరిక్కావాలి?"

"నాక్కావాలి"

"నాకు తెలీదు"

"ఎందుకంతకోపం? నాకు మొగుడు లేడనేగా. నేను పదేళ్ళక్రితం ఎల్లా ఉండేదాన్నో వూహించి, ఆమె నాకంటె అందమైనదేమో చెప్పు" అంది చెవిలో నోరెట్టి.

అప్పట్లో ఆమెమీద వచ్చిన కోపాన్ని నిలదొక్కుకోవడం చాలా కష్టమైంది. అసలందుకోసమే ఈ నృత్య ప్రదర్శనలంటూ పెట్టారు. నటరాజ నృత్యంలో కోపమూ, పగ- ఒక శక్తిగా రూపొంది, ప్రేక్షకులలో నిగూఢమైన ఈ ఉద్రేకాలు బైటపడేటందుకు ఉపకరించింది. వారిని విముక్తుల్ని చెయ్యటమే నాట్యం ప్రయోజనం అనిపిస్తుంది. ఆమెని, ఆ రాళ్ళమీద క్రిందపడేసి దొర్లించి, ఆమె శరీరాన్ని కాళ్ళతో నలిపి, నాట్యం చేసెయ్యాలనిపించింది. కాని, అది సాధ్యం కాదుగా!

తర్వాత తంజావూరు దర్శించాం. ఆ ప్రయాణంలో నాలుగైదు గంటలు, నేను, కనకం, ఫస్టుక్లాస్ పెట్టిలోకి వెళ్ళాం. అక్కడ ప్రత్యేకమైన టేబిల్ మీల్స్ సదుపాయాలున్నాయి. వారి అతిథులుగా కులాసాగా గడిచింది. కాని, ఆ పెట్టెలో హేమలత, ఇందిర, కనకంపట్ల అంత స్నేహభావం చూపడంలేదనిపించింది. ఆమెచేత వారి పనులు చేయించుకుంటున్నారు. బేబీని ఆడిస్తుంది, వూరుకోబెడుతుంది- వాళ్ళ చీరలు, మడత బెడుతుంది. జడ అల్లుతుంది. కాఫీ సరంజాం శుభ్రం చేస్తుంది- విసుగు లేకుండా చేసినకొద్దీ: ఆమెపట్ల వారి అపనమ్మకం ఎక్కువవుతోందనిపించింది. హేమలత సన్నటి మనిషి-మెడకింద ఎముకలు కనిపిస్తాయి. పొడుగాటి పదునైన చేతివేళ్ళు, కోరగాచూసే కళ్ళు, ఏదో అసంతృప్తి, ఏదో ఆకలి, ఆ కళ్ళని కలవరపెట్టినట్లుంటాయి. కనకం అంత నిండైన విగ్రహం కాకపోతే, ఆ చూపులో వేడికి, ఆమె కరిగిపోను.

తంజావూరులో దెబ్భైనాలుగు ఆలయాలున్నా, మేం ఆరే చూశాం. వాటిలో ప్రసిద్ధమైనది రాజరాజు కట్టించిన బృహదీశ్వరాలయం. ద్రవిడ శైలి కట్టడం, రెండువందల పదహారడుగుల ఎత్తుది. దాని శిఖరంపై ఎనభై టన్నుల బరువుగల ఒక పెద్దరాయిమీద కట్టబడింది. సరస్వతి మహల్ పుస్తక భాండాగారంచూసి, నేను అందరితోపాటు బాగుందన్నాను కాని, నాకేమీ నచ్చలేదు. విసుగు పుట్టింది.

శ్రీరంగం బాగుంది. పూరంతా ఒక ఆలయం. శ్రీరంగనాథుడు అద్భుతం. పోయిన మతిని వెదుక్కుంటూ తిరిగేందుకు తగిన స్థలం. అల్లా తిరుగుతూండగా ఒక రాయిమీద కూర్చుని, చిత్రం గీస్తున్న రామనాథం తటస్థపడ్డాడు. అతను ఆర్టిస్టు. ఫస్ట్‌క్లాస్ పెట్టెలో ఆరోసీటు అతను రిజర్వు చేయించుకున్నదిట. ముందుగా వచ్చేసి, మరికొన్ని స్థలాలుచూసి, ఇక్కడ కలుసుకుని, ఆ టూరిస్టు కార్లో ప్రయాణించేసే తోటి యాత్రికుడు, రామనాథం. వయస్సు ముప్పైలోపు. ఇంచుమించు నా వయస్సే. చాలా కళైన మొహం, ఒక్క ఆ పొట్టిమీసం మినహా మధ్యపాపిడి, ఒత్తైన ఉంగరాల జుట్టు, మంచిరంగు, నల్లఫ్రేమ్ కండ్లజోడు, పొడుగాటి ముక్కు, చురుకైన మొహం, తెల్లటి ఖద్దరు లాల్చీ, లాగు, పొట్టికోటు-ఫస్ట్‌క్లాస్‌లో వెళ్ళాల్సిన ఘటమే ననుకున్నాను.

గీస్తున్న పటంకేసి చూశాను స్త్రీమూర్తి- దేన్ని చూసి చెప్మా అనుకుని అటూ, ఇటూ చూశాను. దూరంగా మరోరాతిమీద నిలబడివుంది కనకం. అప్పుడే స్నేహం చేసేసుకుంది చిత్రం.

"బాగుందంటారా? నాకు మనుషుల్ని గీయడంరాదు" అన్నాడు రామనాథం.

"ఓ- మొహం కుదరకపోయినా, మిగత ఒళ్ళంతా కుదిరిందిలెండి" అన్నాను.

"నేను మొహంకేసి చూడటమేలేదు" అన్నాడు. పుస్తకం మూసేసి, కనకానికి థ్యాంక్స్‌చెప్పి నడుస్తున్నాడు రామనాథం.

"చాలా మంచాయన. మనిషికూడా బావున్నాడుకదూ...."

మొహం తిప్పివేశాను.

"నీకే తెలియాలి" అన్నాను.

"అప్పుడే అలక-మాట పూర్తిగ చెప్పనీ- బావున్నాడు మాదిరిగా అనబొయ్యాను" అంది.

"వెఱ్ఱి"

"వెఱ్ఱి అని భలేగా అంటావులే."

"ఛా, ఛా"

"అదిమరీ బాగాఅంటావు. మొగాడికి మరొకమొగాణ్ణి చూస్తే...."

"ఛప్"

కొట్టబొయ్యాను. ఎల్లానో తయాయించుగున్నాను. నాకంటె పదేళ్ల పెద్దది,- ఏమిటీ కబుర్లు! నే నెవర్ననుకుంటోంది! చరచరా నడుచుకుంటూ వెళ్ళిపొయ్యాను.

o o o

"చీకటి పడింది, నేను మా ఫస్టక్లాస్ కంపార్ట్మెంటుకి చేరుకునే సరికి, చూడ్డానికెళ్ళినవారు ఇంకా తిరిగి రాలేదు. థర్డుక్లాస్ పెట్టెదగ్గరికి వెళ్ళి చూశాను ఏమీ తోచక. "రండి, రండి" అని ఆహ్వానించింది కనకం.

"శ్యామలకి ఒంట్లో బాగా లేదుట. తల తిరుగుతోందిట, నేను రాలే నని పడుకుంది. ఒక్కత్తి వుంటుంది పాపం అని నేనూ దిగడిపొయ్యాను. శ్యామల, ప్రెసిడెంట్ రాఘవయ్యగారి చెల్లెలు పి.యు.సి. చదువుతోంది."

లోపలికెళ్ళి శ్యామలకేసి చూశాను. ఆమె వయస్సు ఇరవై లోపే ననుకున్నాను. నాజూకైన, పల్చటి శరీరం — ఆ నీడలో మరీపల్చగా కనిపించింది. వోణీ శరీరం చుట్టూ అంటుకుని వుంది. పరికిణీ మడతలు నడుంకింద స్ఫుటంగా కనబడుతున్నాయి. ఆశ్చ ర్యంతో చూసే పెద్ద కళ్ళు భుజంపై మెలికలు తిరిగి జారుడుగా వేల్లాడు తున్న రెండు పాయల జడ—ఆమె కూర్చుంది. పరికిణీ, వోణీ సర్దు కుంది.

"వీరు రామనాథం గారని, ఉన్నవారు, బాగా చదువుకున్నవారు.... గొప్ప చిత్రకారులు" అని నన్ను పరిచయం చేసింది కనకం.

శ్యామల నమస్కారం పెట్టింది. సిగ్గుతో బైటికి చూస్తోంది.

"నా బొమ్మలు చూడందే, గొప్ప చిత్రకారుణ్ని అని ఎల్లా అనగలరు?" అన్నాను.

"శ్రీరంగంలో నాబొమ్మ వేస్తిరిగా."

"అది ఏమీ బాగాలేదు."

"నేను బాగుంటేగా, బొమ్మ బాగుండేటందుకు. ఏమన్నా?"

"నేను మీ మొహాన్ని వెయ్యాలని యత్నించలేదు—ఊరికే, శరీరం ఆకారం.... పెన్సిల్ స్కెచ్."

"మొహం బాగా లేదని నాకు తెలియదంటారా—"

"అహహ. అదికాదు....అంటె—నా ఇంటరెస్ట్—అంటె,నాక్కావల్సింది....కేవలం....శరీరం....ఎల్లా చెప్పాలో తెలీదు."

శ్యామల నవ్వింది—సంధ్యలో కడసారి కిరణంలా వెలిగించింది ఆ నవ్వులో తళుకు, ఆ కదలికకి కళ్ళులయ కల్పుతున్నట్లుంది.

"మొగాడికి కావల్సింది శరీరమే – నాకు తెలుసు" అంది కనకం. శ్యామలలేచి దూరంగా వెళ్ళింది.

సంభాషణ ధోరణి ప్రమాదంగా పరిణమించకుండా విషయం తప్పించేటందుకు శ్యామలని అడిగాను, మందేదన్నా తీసుకుందా అని.

"మంచి కాఫీ త్రాగితే, తలనొప్పిపోతుంది. రండి, మా కారేజ్‌లో కెళ్ళి, కాఫీ తయారు చేసుకుందాం" అన్నాను.

"నాకేమీ ఒద్దండి – కాసేపు పడుకుంటే అదే పోతుంది" అంది శ్యామల.

"ఉండండి—కాఫీ చేస్తాను."

ఇద్దరం మా పెట్టెలోకి వెళ్ళి, స్విచ్‌వేసి, హీటర్‌మీద కాఫీ తయారు చేశాం. దీపం వెలుగులో కనకాన్ని చూశాను. జుట్టంతా చిందరవందరగా వుంది. జాకెట్టు చేతికింద చెమట డాగులు కనిపిస్తున్నాయి. ఒక వింత వాసన ఆవరించింది. జడలో తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. కొన్ని రాగివర్ణంలో వున్నాయి. కంటికింద గీట్లు కనిపించాయి—పొట్ట

కింద మడతలో అక్కడక్కడ కాఫీరంగు చర్మం కనబడుతోంది. శిథిల మైన ఆలయంలా వుంది కనకం - స్తంభాలు, బురుజులు, గోపురాలు మిగిలి వెనకటి వైభవాన్నిచాటే ఆలయం - ఇంక పునర్నిర్మాణానికి పనికి రాని శిథిలాలు. నాకారకం వస్తువులు ఇష్టం. మనిషి పార్కులో నాటి పెంచిన చెట్లు, మొక్కలులా అందంగా, వరసగా, క్రమంగా మానవ కృషి ఫలితంగా తయారైన ప్రకృతి నా కిష్టం లేదు అని ఫోటోలో ఎంత రోత పుట్టిస్తాయో. చిత్రకళలో కూడా అంతే. అల్లాగే-మనుషులూను. బాగా మేకప్ చేసుగుని ఫేషనబుల్‌గా, ఆధునికంగా కనబడే స్త్రీ, బొమ్మగా బాగుండదు. అసలు స్త్రీ బొమ్మ చక్కదనానికి దుస్తులు కూడా అంతరాయమే. అందుకే ఓల్డుమాస్టర్స్, నగ్నంగా చిత్రించడానికి కిష్టపడేవారు, స్త్రీ మూర్తిని. కనకాన్ని అల్లా చిత్రించే అవకాశంలేదు. ఆమె మనిషి— జీవితంలో నలిగి, మిగిలిన మనిషి. ఆ అనుభవం అంతా ఆమె శరీరంలో వుంది. ఆ శరీరానికి శ్యామల మొహం తగిలిస్తే !

"ఎల్లుండి మేం వేరుగా కొడైకెనాల్ వెడుతున్నాం" అన్నాను.

"బాగుంటుందా?"

"చాలా గొప్ప ప్రకృతి దృశ్యాలు. మీ రొస్తారా?"

"ఎక్కడికైనా వొస్తాను—చాలా అవుతుందా?"

"నేను చూసుకుంటాగా - తోడుగా శ్యామలకూడా వొస్తుందేమో" అన్నాను.

"పెళ్ళికాని పిల్లని పంపుతారా ?"

"మీరున్నారుగా."

నవ్వింది కనకం. దోవలో నిలబడ్డ నన్ను "కాస్త తప్పుకోండి" అని పక్కనించి దిగి వెళ్ళింది కాఫీ కప్పులో. ఆమె ఇంచుమించు, నా అంత ఎత్తు వుంది. అల్లా నిలబెట్టి బొమ్మ గియ్యాలని వుంది. శ్యామల కాఫీ తాగింది.

"చీకట్లో ఎందుకు, మా పెట్టెలోకి రాకూడదూ?" అన్నాను శ్యామలతో.

"ఇంతా నయం. నేవొచ్చి కూర్చున్నందుకే మా వాళ్ళు మండిపడు

తున్నారు" అంది కనకం.

"నేనొచ్చి మీ పెట్టెలో కూర్చుంటే మీవాళ్ళ కోపం తగ్గుతుం దేమో" అన్నాను.

నా వద్దవున్న ట్రాన్‌సిస్టర్ రేడియోతెచ్చి శ్యామల కిచ్చాను.

"కాస్త కాలక్షేపం — వుండనివ్వండి" అన్నాను. ఆమె తీసుకో వాలో కూడదో తెలియక తటపటాయిస్తుంటే, కనకం దాన్ని తీసుకుని, అది మోగే యత్నం చేస్తోంది. ఎల్లా చెయ్యాలో చెప్పాను. తిరుచిరపల్లి రేడియో కేంద్రం, ఇప్పైతట్టు సంగీతం వొస్తోంది. ఇంతలో జనం రావడం సాగించారు.

"థ్యాంక్స్" అంది శ్యామల. నేను నా పెట్టెలోకి వెళ్ళిపొయ్యాను.

మర్నాడు పగలల్లా థర్డుక్లాస్ పెట్టెలో గడిపాను. నన్నెవ్వరూ మందహాసంతో ఆహ్వానించి పలకరించలేదు. కనకం లేచి తన సీటు ఇచ్చింది. ట్రాన్‌సిస్టర్ పెట్టింది. దాన్ని మోగించవద్దన్నారు, చెట్టిగారు, రక్షితలాల్, నా యిష్టం నే పెట్టుగుంటానంది కనకం. కాసేపు వాదించు కున్నారు. ధనంజయంగారి ప్రార్థనకది అంతరాయంట. మాకీ అరవగోల వద్దన్నాడు. పద్మనాభం, ధనంజయం దగ్గుతున్నాడు. ఆయన ఒంట్లో బాగా లేదట. నాగభూషణం మందు ఇస్తానంటే ఒద్దన్నాడు.

"కాసేపు కాలక్షేపం అవుతుంది రేడియో పెట్టండి" అన్నాడు ధనంజయం నవ్వుతూ. పెద్దాయన—గడ్డం నెరిసింది—తలని తెల్ల వెంట్రుకలు కాడల్లా వేల్లాడుతున్నాయి.

"మందులతోకాక, ఈ రేడియో గొడవతో కూడా ఆయన్ని చంపు తారా?" అని చౌదరి ప్రశ్నించాడు. దానిమీద వాదం రేగింది. రెండు పక్షాలయ్యారు జనం.

"ఇది ఫస్టుక్లాస్‌లో వారి రేడియో అనేగా మీ బెంగ—ఎవరిచ్చారో, వారు ఇక్కడే ఉన్నారు—మనతో కలిసే ప్రయాణం చేస్తున్నారు. ఇంక సరా!" అంది కనకం. జనం మౌనంలో పడ్డారు. కనకం రేడియోని,

నాగభూషణంగారబ్బాయి "రవి" కిచ్చి ధనంజయంగా రొక్కారూ వినే లాగు ఆయన దగ్గర కూర్చుని పెట్టమని తనూ వెళ్ళి ఆయన పక్కన కూర్చుంది.

"ఇదిగో మామయ్యా—హాయిగా పెట్టుగో రేడియో. రవి పెడతాడు."

"ఎంతమంచిదానివి కనకం. ఈ పెట్టెలో ప్రతివాడూ, నన్ను తాతయ్యా అంటున్నారు. ముద్దుగా మావయ్యా అని పిలిచింది నువ్వొక్క దానివే," అంటూ ధనంజయం బోసిగా నవ్వుతున్నాడు. నేను శ్యామల కేసి చూస్తూ కూర్చున్నాను. ఎవ్వరూ తనకేసి చూడకుండా, నాకేసి చూడటం గమనించాను. ఆమె చూపుకోసం ఆ పెట్టెలో గొడవంతా భరిస్తూ కూర్చోగలను. శ్యామలలో నన్నాకర్షించింది, అమాయకత్వం. ఆమె దగ్గరగా కూర్చుంటే ధైర్యంగా, ఆరోగ్యకరంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ప్రెసిడెంట్ రాఘవయ్యగారి పరిచయంపొంది, కబుర్లుచెప్పి, వారుకూడా కొడైకనాల్‌కి వచ్చే ఏర్పాటు చేశాను.

దిండిగల్‌లో మేం దిగిపోయ్యాం.టూరిస్టు పెట్టెలు రెండూ, మధుర వెళ్ళే ప్యాసింజర్ ట్రైన్‌కి తగిలిస్తారు. కనకాన్ని మీరూ రావాలని ప్రతి మిలాడాను. ఒప్పుకుంది. కొడైకనాల్‌కి చేరుకున్నాం టాక్సీలో. రెండు గదుల కాటేజ్ పుచ్చుకున్నాం. అక్కడ తటస్థపడిన స్నేహితుడితో రాఘ వయ్యగారు వెళ్ళారు. నేను, వారి భార్య, చెల్లెలు శ్యామలా, కనకం దృశ్యాలు చూస్తూగడిపాం ఆ రోజు.

సాయంత్రం నాలుగైంది. కోకర్స్‌వాక్ అనే చోటికి చేరుకునేట ప్పటికి. అక్కడనుంచిచూస్తే, చుట్టూ అద్భుతమైన దృశ్యం కనబడు తుంది. చాలా ఎత్తైనచెట్లు, ఉదారంగు పూడలు, చెట్లకొమ్మలుమేఘాల మధ్య ఇరుక్కున్నాయి. సౌందర్యం భరించలేక ప్రకృతికన్య కన్నీరు కారుస్తున్నట్లు అక్కడ సన్నటి జలపాతం—ఏడవద్దు అన్నట్లు అడ్డు కునే ఎర్రరాతి బండలు, ఆకుపచ్చ చీర విప్పేసి ఎండపేసినట్లు పచ్చని గడ్డి బయలు దూరంగా ముద్దుకోసం దగ్గరికి జరిగిన కొండశిఖరాలు

"నేనింక నడవలేను బాబూ—ఇక్కడ రెస్టు తీసుకుంటాను. మీరు తిరిగి రండి" అంది రాఘవయ్యభార్య సుందరం.

"జలపాతం చూద్దామా?" అంది శ్యామల. కనకం ముందు నడుస్తోంది. ఆమె వెనక శ్యామల, ఆకుపచ్చరంగు చలికోటు వేసుకుని. కోటు కింద లంగా గూడ కట్టులా కనబడుతోంది. జడపాయిలు కోటులో ఉండిపోయి, బాబ్డ్ హైయిర్‌లా కనబడుతోంది తల. కోడై లోకొన్న ఆ కోటు ఆమెకి కాస్తబిదులైంది—మరీ సన్నగా కనబడుతూంది. రాతిబండమీద కూర్చుంది. ఆమె మొహం ఆయాసంతో ఎర్రబడింది. చెమట నుదుటిమీద హారంలా అనుకుంది. కోటు తీసేసింది. రంగు రంగు పూల డిజైను జాకెట్టు, అడ్డచారల వోణి—శ్యామల ఆ చెట్లల్లో, రాళ్ళల్లో కలిసిపోయింది. మనిషిలేని ప్రకృతికి ప్రాణంలేదు శ్యామల చల్లటి చూపులతో, వెండి వెలుగుతో, మృదువైన నడుం ఒంపులో జిగిబిగి జడలో ఆ దృశ్యానికి పరిపూర్ణత సమకూరింది.

నేనామె బొమ్మ గియ్యలేకపోతున్నాను. కావల్సిన ఏకాగ్రత రావడంలేదు. మరోస్థలంనుండి వేద్దామని, కొంచెం పక్కకి జరిగాను. అక్కడ మొక్కలు గుబురుగా ఉన్నాయి. వాటిని పెంకుతో తవ్వి, తొలిగించే యత్నంలో ఏదో ముల్లుదిగి మూడోవేలు మధ్య రక్తం కారుతూంది. ముల్లు లాగేశాను.

"కట్టు కట్టుకోరు?" అని దగ్గరగా వచ్చింది శ్యామల.

"చిన్నది. ఫరవాలేదు. రుమాలుందిగా" అని చేతిగుడ్డ మడిచి వేలుకి నొక్కాను.

"కనకం ఏదీ?" అంది ఆమె.

"అల్లా ముందుకి వెళ్ళుంటుంది" అన్నాను.

"కాసేపు విశ్రాంతి—లొడ లొడా వాగుతూంటుంది. ఆవిడ బొమ్మ వేశారుటగా?" అంది శ్యామల.

"అవును. ఏదో స్కెచ్‌లాంటిది. వూరికే శరీరం ఒక ఏంగిల్‌లో ఎల్లాఉంటుందో స్టడీ చెయ్యాలని...."

"మీ కావిడంటె ఇష్టంకదూ?"

"అర్టిస్టు కళ్ళతో చూస్తాను, అంతే. అందులో ఏ ఉద్రేకమూ లేదు."

"నాకు చెప్పరండి—కనకం వృత్తిలో మనిషట. ఆమె ఈ బండిలో వస్తుందని తెలిస్తే మా అన్నయ్య రాకనే పోను. డబ్బుకోసం ఏదన్నా చేస్తుంది."

"నన్నింతవరకూకానీ అడగలేదు. ఆమె ఏ వృత్తిచేస్తే నాకేంపని. ఉగ్రంగా ఉంటుంది. స్వేచ్ఛగా, చలాకీగా మాట్లాడుతుంది. నాకంటె, పదేళ్ళు పెద్దది. మా ఇద్దరిమధ్య నువ్వు వూహించిన స్నేహం లేదంటే నమ్ముతావా శ్యామలా?"

"ట్రాన్ సిస్టర్ ఇచ్చారుగా."

"మీ కంపార్ట్‌మెంట్‌లో కాలక్షేపంకోసం ఇచ్చింది." ఆమె దగ్గరగా వచ్చింది. సూర్యుడు దిగిపోతూ, ఎర్ర కిరణంతో ఆమె బుగ్గస్పృశించాడు. చిరు వెంట్రుకలు బంగారు తీగెలుగా కళ్ళమీదికి జారి, వాటి నీడలు మెడ కిందికి సాగుతున్నాయి. పమిటిగాలికి తొలిగింది. స్తనాలమధ్య విడినచోట లేతగా నీడ పడింది.

"చూడొచ్చా బొమ్మ."

"సాధారణంగా మనిషికంటె బొమ్మ బాగుంటుంది. నువ్వు నీ బొమ్మకంటె బాగుంటావు."

మోకాలుమీద తన గడ్డం ఆనించి కళ్ళల్లోకి చూస్తోంది. పల్చటి మనిషి, కాడలాంటి వేళ్ళు—బొమ్మకి బాగుండవు—కాని, నాలో తృష్ణ బైలుదేరింది. ఆమెను గట్టిగా దగ్గరకు తీసుకుని, కౌగలించుకున్నాను. విడిచేసి పక్కకి తిప్పేశాను, నా మొహాన్ని. రుమాలుతో కళ్ళంట కారే నీళ్ళని తుడుచుకున్నాను. భరించరాని అనుభూతికి అప్రయత్నంగా ఏడ్పొచ్చింది.

"నే నింక నీ బొమ్మ ఎప్పుడూ వెయ్యలేను. ఇద్దరం మనుషులుగా ఐపొయ్యాము." నా క్రాపింగ్‌లో వేళ్ళు పెట్టి కదుపుతోంది శ్యామల.

"మీరు నన్ను ప్రేమిస్తున్నారా?"

"సమాధానం చెప్పే అర్హత లేదు నాకు" అన్నాను.

"నేను చెప్పనా?" అంది శ్యామల.

ఆమె మాట్లాడే అవకాశంలేదు. కనకం వచ్చేసింది. తను ఆ కింద రాళ్ళమధ్య నీళ్ళలో మొహం కడుక్కుందిట. చల్లగా, స్వేచ్ఛగా, ఆనందించిందిట.

"మీ మాదిరిగానే...." అని ముగించింది.

"ఏమిటా మాటలు?"

"తప్పేమన్నాను? ఈడు జోడైన మీరిద్దరూ, స్వేచ్ఛగా, హాయిగా ఉన్నారన్నాను."

"అల్లాంటి వాగుడు ఎప్పుడూ వాగకు. నేను చదువు కున్న దాన్ని —అందులో నువ్వా అనడం—?"

"నువ్వా అంటె? వయస్సులో పెద్దదాన్ని తమాషాకంటె తప్పా— ఏమంది. రామనాథంగారూ మీరు చెప్పండి."

శ్యామల ముందు నడుస్తోంది. ఆమె వెనకాల కనకం నడుస్తోంది. పశ్చిమ ఆకాశంలో కాస్త చెరిగిన కుంకుమ బొట్టులాగా, ఎరుపుమిగిలినా, చెట్లనీడలమధ్య చీకటి నాలుకలు జాస్తోంది. కనకం శ్యామలని గట్టిగా కౌగలించుకుంది. ముద్దు పెట్టుకుంటోంది.

"వెర్రిపిల్ల. నువ్వంటే ఎంత ఇష్టమో నువ్వెరగవు."

"మొగాళ్ళంటె ఇష్టం నీకు."

మొగాళ్ళపట్లే ఇష్టంగా ఉండాలి ఆడది. వాళ్ళు దిగులుగా, ఒంటిగా, బెంగగా ఉంటారు. వోదార్పు కావాలి. నాకు చాలా అనుభవం ఉంది. ఆ వోదార్పుఇస్తే, పసిపిల్లల్లె ఒళ్ళోపడుకొని జోకొట్టమంటారు. వాళ్ళ కిష్టమైన ఆడాళ్ళంటె మరీ ఇష్టం నాకు—సరా?"

శ్యామల, ఆమె చెంపమీద కొట్టింది. కనకం పక్కకి తిరిగి ఏడ్చేస్తోంది. నాకు భయమేసింది. ఏం చెయ్యాలో తెలియలేదు.

"చదువుకున్నదానివి, అట్లా చెయ్యొచ్చా శ్యామలా?"

శ్యామల కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. కనకంవచ్చి, ఆమె మొహాన్ని తన కొంగుతో తుడుస్తోంది.

"మళ్ళాకొట్టు—ఇదిగో చెంప. కొడితే ముద్దు పెట్టు కొన్నట్టుగా ఉంది." దాంతో శ్యామల, వెర్రిగా నవ్వేసింది. నిలిచిన ఏడ్పు, వీడిన కోపమూ, ఎగిరివచ్చే అప్యాయతా, ఆమె మొహంలో నూతన వికాసాన్ని తెచ్చాయి. చీకటిని ఎవరో వెలిగించి నట్లైంది. సుందరం మా ఎదురుగా వచ్చి, తొందరగారండి, వెడదాం అంటోంది. వెనక్కి తిరిగి, ఇంటికి చేరుకునేటప్పటికి ఎనిమిదైంది.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. రాఘవయ్యగారు నుండు నా పక్క గదిలో పరున్నారు. వారిపక్కన, సుందరం, శ్యామల, మధ్య హాలులో కనకం పరుంది. నేను మండువా ముందు గదిలో వేసుకున్నాను. బైటకొచ్చి చెట్టుకింద కూర్చుని ఆకాశంకేసి చూస్తున్నాను. దట్టంగా మేఘాలు అల్లుకున్నాయి. తీక్షణంగా చూస్తేతప్ప, వాటిమధ్య మెరిసే నక్షత్రాలు కనబడటంలేదు. ప్రకృతి అదృష్టవంతురాలు. భూమి నిద్ర పోతున్నప్పుడు ఆకాశం కాపలాకాస్తూ ఒక కంట కనిపెడుతూ ఉంటుంది. కనకాన్ని గురించి ఆలోచనలు. ఆమె ఆ వృత్తిలోదని నాకూ ఏదో అనుమానం ఉంటూనే వచ్చింది. ఆ వృత్తిని గురించి చదివాను. వారూ, వీరూ చెప్పగా విన్నాను. వృత్తులన్నింటిలోకీ అతి పురాతనమైందిట. అది లేకుంటే వివాహం అనే సంస్థ స్థిరంగా నిలబడదట. ప్రాశ్చాత్య దేశాలలో కొందరు స్త్రీలు, కళాకారుల మోడల్స్‌గాఉండే వృత్తి సాగించి, జీవనం గడుపుకుంటారుట. కనకంలాంటి స్త్రీలు, ఇట్లా ఎందుకు గడపకూడదు? మన సంఘంలో ఇతరులకి సంతోషాన్ని, వినోదాన్ని కల్పించే ఏ వృత్తిపట్లా గౌరవంలేదు. నాటకంలో వేషంవేసే ఆడదానిపట్ల గౌరవంలేదు. ఆర్టిస్టు మోడలూ అంతే అవుతుంది. వీరందరూ, ఇతరులకి వినోదం కల్పించడం కోసం శ్రమపడేవారే. ఉద్యోగంచేసే స్త్రీకి పెండ్లి కావడంలేదు. అది కూడా, ఏదో విధంగా పదిమందిలోకివచ్చి, శ్రమించడమే అవుతుంది. నాలుగు గోడలమధ్య—నాలుగు మంచంకోళ్ళమధ్య గడపాలి. అసలు ఎవరూ సంతోషంగా ఉండటం హర్షించదు సమాజం. ఈ ప్రయాణంలో సమాజంలేదు. థర్డ్‌క్లాస్‌పెట్టి నియమాలను పాటించడంతప్ప, వ్యక్తిగతమైన పేచీలుతప్ప, నియమాలులేవు. కాసేపు స్వేచ్ఛ, ఎవరు ఎవరేం

చేసింది, ఎవరికీ అక్కర్లేదు—దానివల్ల వారిచేతి డబ్బు పడకుండా ఉండ దంతప్ప. లేచి హాల్లో కెళ్ళాను. చీకటిగాఉంది. కనకం ఒక నల్ల ముద్దలా బ్లాంకెంట్ కప్పుకుని ఉంది. ఆమె నడుంపైన చెయ్యివేసి కదిపాను.

ఆమెస్తనాలు మోచేతికి తగాలాయి. చెయ్యి నా పీక మీదవేసి, చివాలున వొక్క తోపు తోసింది. వెనక్కిపడ్డాను. లేచి కూర్చుంది.

"ఎవరదీ?" బ్యాటరీలైట్ మొహంమీద వేసింది.

"మీరా రాఘవయ్యనుకున్నాను." ఆశ్చర్యపడ్డాను. మన సెల్లాగో అయింది. లేచి వరండాలో కొచ్చేశాను. వెనకాలే వచ్చింది.

"మీరైతే ఫరవాలేదులెండి. ఎవ్వరితో అనమాకండి, నిన్నరాత్రి, రాఘవయ్య వచ్చాడు. మీద చెయ్యివేసి కదిపాడు. నేనండీ, కనకాన్ని—సుందరం అనుకున్నారా — భలేవారే—అన్నాను. సిగ్గుపడి వెళ్ళి పోయ్యాడు."

"నువ్వు చనువుగా ఉండబట్టే రాఘవయ్య అట్లా చేసుంటాడు. ఆయనకేం బాగా ఉన్నవాడు. ఎందుకట్లా తోసెయ్యడం?"

కనకానికి కోపం వచ్చినట్లుంది.

"డబ్బు కావల్సి వచ్చిన రోజుల్లో నేను అందరినీ భరించాను ఇప్పుడు నేనల్లా భరించవల్సిన అవసరంలేదు."

"ఇప్పుడేం కావాలి?"

"పెండ్లి"

నేను మెల్లగా నవ్వేశాను.

"ఏం చేసుకోకూడదా? నాకూ, ఇల్లూ, పిల్లలూ కావాలని ఉండదా పాపం"

"పిల్లలా."

కనకం ఏడుస్తోంది. ఓదారుస్తూ కన్నీటిని తుడుస్తున్నాను. మెత్తగా గుండ్రంగా, భుజం తగిలింది. జుట్టు నిమురుతున్నాను. మొహం నావైపు తిప్పి, నడుం దగ్గరకి లాక్కున్నాను.

"అవేం పనులు. విడిచెయ్యండి. పెండ్లిచేసుకుంటారా?"

"ఏదీ కోరకుండా ఈ క్షణం ఇల్లా కలిసి ఉండకూడదూ?"

"మీరా ఈ మాటలంటున్నది? మీకు శ్యామల కావాలి. ఆమెకి మీరంటే పంచప్రాణాలూను. మీ రిరువురూ స్నేహంగా, ఆనందంగా వుండి, ఒక ఇంటివాళ్ళయితే, చూసి మురిసిపోదామనే ఈ ప్రయాణానికి వప్పుకున్నాను."

కనకం ఏడుస్తోంది. ఎందుకు? నా కర్థంకాదు. ఆమె దూరమైన కొద్దీ, తృష్ణ పెరుగుతోంది.

"శ్యామలని దూరంగా,ఊహలో తల్చుకుని ప్రేమించాలి" దగ్గరికి లాక్కున్నాను.

"ఏం మొగాళ్ళబ్బా" అని తోసేసి లోనికివెళ్ళి, తలుపు గడియ వేసింది.

ఆ మర్నాడు మధురకి ప్రయాణమయ్యాం.

○ ○ ○

"అంతవరకూ ఏమైందో దిండిగల్‌లో మాథర్డ్‌క్లాస్‌పెట్టెలోకొచ్చింది కనకం. నా ముందుసీట్లో ఉంటున్న శ్యామలరావు, మరో సీటులోకి ఫిరాయించాడు. ఆ స్థానం ఆక్రమించింది. మధ్య మధ్య ఆ వెనక పెట్టెలోకి వెళ్ళి అక్కడనుండి, బిస్కెట్లు, యాపిల్స్ తీసుకొచ్చి తినేది. నాకది గిట్టదు. అసలు మా పెట్టెలో వాళ్ళెవ్వరికీ గిట్టదు.

"చౌదరిగారూ, ఇందండి—" అని బిస్కెట్లు ఇవ్వబోయింది.

"నా కిష్టంలేదు" మొహం తిప్పేసి పత్రిక చదువుకుంటున్నాను.

"పత్రికలో విశేషాలు చెప్తారా ?"

"నీ కర్థంకావులే."

"మీవార్ని తీసుకురాలేదేం ?"

"నీ కెందుకు? చచ్చింది గనుక" అన్నాను కసిగా.

"అయ్యోపాపం."

తనకి కావల్సిన పదార్థాలన్నీ విఠలయ్యతో మెల్లిగాచెప్పి చేయించుకునేది. "స్నానంచేసి కొత్త మడుగున కట్టుకోవచ్చుగా బట్ట. మా అందరి ముందూ సాగిస్తుంది ఆ తతంగం. దిగి ఊళ్ళోకెళ్ళాలంటే, తను ముస్తాబయ్యేసరికి ఆలస్యం అవడం మామూలే. ఇది చాలక, పక్క పెట్టెలో

ఒకర్ని ఈ పెట్టెలోకి తెచ్చి కబుర్లు సాగిస్తుంది. నే కూర్చున్నవైపు కిటికీ తలుపువేస్తే తను తెరుస్తుంది

"మంచిగాలి-చక్కటి పొలాలు అటు చూడండి చౌదరిగారూ."

"నా తలకాయ రైలుబొగ్గు, నుసి, దుమ్ము - తలుపుముయ్యి" అన్నాను.

"మీమీదకి రాకుండా అటు గుడ్డకట్టనా ?"

"తియ్యడానికి వీల్లేదు" అని గర్జించాను.

"ఎందుకు వీల్లేదు? అసలు మీరంతా ఇల్లా ఎందుకొచ్చినట్లు—నాలుగూ చూడ్డానికేగా. మీ కభ్యంతరం లేకపోతే, మీ వేపుకొచ్చి కిటికీ ముందు కూర్చుంటా. ఆ దుమ్మంతా నామీదే పడుతుంది" అని అనడం ఏమిటి తనొచ్చి నా పక్కన కూర్చోడం ఏమిటి రెండూ ఒకసారే జరిగాయి.

"వీల్లేదు-నేను చాచుకుని పడుంటాను" అన్నాను.

ఆమె కూర్చోకుండా ముందుకు జరిగి, బిగించి కూర్చుని తలుపు మూసేశాను.

తలుపు తీసివుంచే హక్కు ఆమెకుందని, ఆమె పక్షం వాదించ సాగారు, శ్యామలరావు, రక్షితలాల్, లక్ష్మణమూర్తి, మూసేసే హక్కు నాకూ ఉందని, రాఘవయ్య, నాగభూషణం, చెట్టిగారు-రెండు పక్షాలై, ప్రాథమిక హక్కులని గురించి ఘర్షణ సాగింది రెండు గంటలు రైలు నిల్చింది మధుర చేరుకున్నాం. పదింటికే భోజనాలుచేసి, బస్సులో ఊళ్ళోకి బయలుదేరాం. ఫస్టుక్లాస్‌లో కృష్ణమూర్తి మధుర చరిత్ర చెప్పడం మొదలెట్టాడు. పదవ శతాబ్దంలో చోళులు పాండ్య రాజ్యాన్ని గెలుచుకున్నారుట నాయక పాలకుల కాలంలో పాండ్యరాజ్యం మహాదశ అనుభవించిందట. విశ్వనాథ నాయకుడు మధురని కట్టించాడుట. రాణి మంగమ్మ వైభవం గురించి చెప్తూంటే కనకం తనే రాణీ అయినట్లు గర్వంగా చూసింది. అది మీనాక్షి ఆలయం. వెనకటి ఆలయాన్ని 1310లో మలిక్ కాఫూర్ ధ్వంసం చేశాడు. 1560లో విశ్వనాథ నాయకుడు కొత్త ఆలయాన్ని ప్రారంభిం

చాడు. అది నూటఇరవై యేళ్ళ తర్వాత పూర్తయింది. పన్నెండు మిలి యన్ల రూపాయలు ఖర్చయిందిట.

ఆలయం వైశాల్యం, శిల్పాలు చూస్తే ఇది చాలా కొద్ది మొత్తమే అనుకోవచ్చు. ముప్పైమూడు మిలియన్ల శిల్పాలు, ప్రతిమలు ఉన్నాయి మీనాక్షి ఆలయంలో. వెయ్యి స్తంభాల మంటపంచూసి, సంగీతం పాడే స్తంభాల దగ్గరకొచ్చాం. "చెవి దగ్గరగా పెట్టండి-నాదం విందురుగాని" అని కనకం, నా చెవి స్తంభాన కానించింది. అదొకలా చూసింది.

"ఎంత బాగుందండీ—ఇక్కడే ఉండిపోవాలనుంది. నా జన్మ తరించింది." అంటోంది. తరువాత తిరుమల నాయక్ మహల్ చూశాం. హిందూ, ముస్లిమ్ గాతిక్ సంప్రదాయాల వాస్తు శిల్ప సముదాయంట ఆ మహల్. నాకంత నచ్చలేదు. దాన్నిండా గబ్బిలాలు, పావురాల రెట్టలు, ఆఫీసులు, దవాలి బంట్రోతులు, నల్లకోటు ప్లీడర్లు, గుమస్తాలూ తిరుగు తున్నారు. వాళ్ళందర్నీ బయటికి తరిమివేస్తే అది బాగుంటుందేమో, చూస్తేకాని చెప్పలేము.

అలగర్ కోవిలకెళ్ళాం. కొందరం ఫస్ట్‌క్లాస్ బృందంవారినుండి విడిపోవాలని. ఏప్రిల్ మాసంలో మీనాక్షి, సుందరేశ్వరుల కళ్యాణం మధు రలో జరుపుతారుట. మీనాక్షి సోదరుడు, అలగర్.

పెండ్లయిన మర్నాడువచ్చి; చీకాకుపడ్డ ఉదంతం చెప్పాడు, లక్ష్మణమూర్తి నా కక్కడి శిల్పాలు నచ్చాయి. వెనక పెద్దకొండ, దిగు వున చెట్లు, చల్లటి నీడలు, పరిశుభ్రమైన స్థలం. నా ఒళ్ళు తల తిరుగు తున్నాయి. వాంతయింది. ఆ రాయిమీద పడుకున్నాను. జ్వరం తగిలింది. తల నెప్పి, కళ్ళు మూతలుపడుతున్నాయి. లేవలేకపొయ్యాను. మా వాళ్ళె వరూ కనిపించటంలేదు. కోవిలలోకి వెళ్ళలేకపొయ్యాను. అటు వెళ్ళే కుర్రాడిని కేకేసి, ఆలయంలో పెద్దల్ని పిలవమన్నాను. పరుగెత్తుకుంటూ వచ్చింది కనకం. నా స్థితిచూసి ఆశ్చర్యపడింది.

"ఏమిటిల్లాగయ్యారు ?"

"జ్వరం కాబోలు."

"నేనే కారణం. రైలు కిటికీ తెరిచాను. ఆ బొగ్గు, దుమ్ము మీకు

పడలేదు" అంది కనకం. జాలేసింది. జట్కాబండి పిలిచింది. మెల్లిగా బండిలో కెక్కించారు. హాస్పిటల్‌కి వెళ్ళాం. అక్కడి డాక్టర్లు పరీక్షించి మందిచ్చారు. మూడు గంటల కొక మోతాదు పుచ్చుకోమన్నారు. తిన్నగా స్టేషన్‌కెళ్ళి ప్లాట్‌ఫారం అవతల నిలబడిన పెట్టెలోకి చేరుకున్నాం. పక్కసర్ది, పడుకోబెట్టి ఒక మోతాదు మందిచ్చింది. సాయంత్రం అయ్యింది చీకటిపడుతోంది.

"ఇక్కడ దీపాలులేవు. ఆ ఫస్ట్‌క్లాస్ పెట్టెలో పరుంటారా? కాస్త కాఫీకూడా కలుపుతాను."

"ఇక్కడే చస్తాను"

"ఏం మ్మాటలండవి. నే ఉండగా అంతపని జరగనిస్తానూ."

పక్కపెట్టెలోకెళ్ళి కాఫీ తెచ్చింది. జ్వరం దిగజారుతోంది. కాస్త తేలికగావుంది. ఆమె చేతితో నా నుదురురాస్తోంది.

"నిద్రపోండి."

ఆమె చెయ్యి నా చేతికింద ఇమిడింది. చెయ్యి చల్లగా ఉంది. నా మొహాన కాసేపు తిప్పాను. తను లాగెయ్యబోయింది. ఆమె మెడచుట్టూ చేతులుపెట్టి నా వక్షంమీదికి లాక్కున్నాను.

ఇట్లాగయితే జ్వరం తగ్గేదెట్లా చౌదరిగారూ?" అన్నది. ఇంకా దగ్గరికి లాక్కున్నాను. తప్పించుకుని, దూరంగా వెళ్ళి కూర్చుంది.

"మీ ఆవిడ జ్ఞప్తికొస్తుందా పాపం!" అన్నది. కిటికీ మూసింది. పెట్టెలో జనంవచ్చే అలజడయింది.

"కిటికీ తియ్యి. చల్లగాలిరానీ-అవిగో నక్షత్రాలు" అన్నాను. నిద్ర పట్టేసింది.

ం ం

మండపం స్టేషన్‌నుండి, పాంబన్ స్టేషన్‌వరకూ మధ్య సముద్రం వుంది. ఆ సముద్రంమీదుగావంతెనవుంది. ఆ వంతెనమీదుగా వెడుతుంది రైలు. రామనాథం అదృశ్యం పెన్సిల్‌చిత్రంగాగీస్తున్నాడు. హేమలతనిద్ర పోతోంది. కనకం బేబీనిజోకొడుతుంది.కృష్ణమూర్తి దృశ్యంచూస్తున్నాడు.

నన్నెక్కువగా ఆకర్షించింది ఆ సముద్రంమీదుగా రైలు వెళ్ళడమే. అందులో భయమూ, ఆనందమూ వున్నాయి. నీలంరంగు అలను, పెద్ద పెద్ద రాతిబండలచుట్టూ కవ్విస్తూ తిరుగుతాయి. వాటిమీద తెల్లటి నురుగు కిరీటంలా అలుముకొని వుంటుంది. ఒక్కొక్క కెరటం, ఒక్కొక్క కావ్యం-సౌందర్యంగా వుండటంతప్ప వేరే సందేశం ఇవ్వదు. రాతిబండ మీద నురుగు ఎగిరిన శబ్దంలో ఐకలయ, క్రమం వున్నాయి. పాటుపోట్లు ఒక నృత్యం-అనంత సౌందర్య అంటే అదేననుకుంటా.

రామేశ్వరం స్టేషన్ హోటల్‌లో దిగాంమేం. థర్డ్‌క్లాస్ ప్రయాణీకులు వేరే చౌల్ట్రీలో బసచేసి వంటలు వొండుకున్నారు. శ్రీరామనాథ స్వామి ఆలయం దర్శించేముందు సముద్ర స్నానం చేశాం. సముద్రం వొడ్డున ఇసుకలో చెట్ల ఆకులు, ఎర్రపూలు తుట్టలు తుట్టలుగా రాలి, నీటిని ఊదారంగుతో కప్పివేస్తాయి.

ఉభయపెట్టెల ప్రయాణీకులం రామనాథస్వామి ఆలయంలో కలుసుకున్నాం. నాలుగువేల అడుగుల ప్రాకారాలు-గ్యాలరీలకింద, రెండు వైపులా విడిపోతాయి. అనేక మూలలనుండి సన్నటి వెలుగుపడి గుహాలని వింతవింత రంగులతో నింపుతుంది. కనకం, ధనంజయాన్ని నడిపించుకుంటూ వస్తోంది. ఆయన ఆయాసపడుతున్నాడు. నడవలేకపోతున్నాడు. దగ్గుతున్నాడు చేతిలో కర్ర వూగిపోతోంది. స్నానాలుచేస్తూ బట్టలుతడిసినాయి

"ఆయన ఇట్లా స్నానాలుచేసి తడవడం మంచిదికాదు." అన్నాను.

"నేనూ అదే చెపుతున్నాను. వినడంలేదు మధుసూదనం" అంది కనకం.

"నేనిక్కడ హరీ అంటే, ఎంతో పుణ్యం?" అన్నాడు ధనంజయం దగ్గు ఆపుకుంటూ.

"మీరిట్లాంటి మాటలంటే, తీసుకెళ్ళి స్టేషన్‌లోదించేస్తా మావయ్యా" అంది కనకం.

ఈలోగా మా ఆవిడ హేమలత, ఇందిర, ఆమెభర్త కృష్ణమూర్తి వచ్చారు.

"మమ్మల్ని ఏమీ చూడనియ్యదలుచుకోలేదా?" అంది హేమలత కనకంతో.

"నేనేం చేశాను ?"

"నువ్వేం చెయ్యడంలేదు? కాపరం, మా పెట్టెలో పడక, సరసాలూ మాపెట్టెలో."

"మీ ఆయనతో ఆడలేదుగా సరసాలు."

"అదొక్కటే మిగిలింది."

"అంత భయమైతే మొగుణ్ని కొంగుకి ముడేసుకోలేక పొయ్యారూ ?"

"నీకంటే మొగుడంటూ అక్కర్లేదు."

ఊరుకోమని హేమలతకి సంజ్ఞచేశాను. దగ్గుతో ధనంజయం స్తంభం పక్కన మెట్లమీద వాలిపొయ్యాడు. కనకం ఆయన్ని లేవదీసి కూర్చొబెట్టింది. మళ్ళా అందుకుంది.

"నాఖర్మ-ఎవరూ చేసుకుంటాననడంలేదు. ఊఁ అంటేమామయ్యగార్ని ఇప్పుడు చేసుకుంటాను" అంది కనకం. ధనంజయంకేసి చూస్తూ ఇందిర నవ్వేసింది.

"ఆయన ఈ యాత్ర పూర్తిచెయ్యడం ఇష్టంలేదా?" ఈలోగా మెట్టుమీద బేబీ జారి దొర్లిపడటం, కనకం దాన్ని పట్టుకోడం, ఆ పట్టుకోడంలో ధనంజయంగారి మెడకింద పట్టు వదిలెయ్యడం, ఆయన తల మెట్టుకి తగిలి దెబ్బతగలడం, అన్నీ క్షణంలో జరిగాయి. నేను హేమలతా గంతేసి బేబీని తీసుకున్నాం. గుక్కపెట్టి ఏడుస్తోంది-కాని ఏ దెబ్బా తగలలేదు. ధనంజయం నెత్తికి చిన్నగాయం తగిలి, రక్తం వొస్తోంది. కృష్ణమూర్తి కట్టుకట్టాడు.

"వారిని స్టేషన్‌కి తీసుకువెళ్ళండి" అన్నాడు కృష్ణమూర్తి.

"నే వెళ్ళను. అన్ని స్నానాలు పూర్తికావాలి. చస్తే ఇక్కడే చస్తాను."

"నా మాట వినండి. మీరీ స్థితిలో స్నానాలు చెయ్యకూడదు. మీ పేటలో డాక్టర్ నాగభూషణంగారున్నారుగా. మందు తీసుకుని రెస్టుగా పడు కోండి. ధనుష్కోడిలో చెయ్యొచ్చు స్నానం" అన్నాను బండిని కేకేసి, ఆయన్ని అందులో ఎక్కించాం.

"పద, నేనూ వస్తాను" అన్నాను.

"అమ్మో, మీరు రావద్దు. హేమలత మండిపడుతుంది", అంది కనకం.

"దాంది, అర్థంలేని చిరాకులే. సత్యభామ కోపం నేను సర్దుబాటు చేస్తా", అన్నాను. నేను వొస్తే తను దిగిపోతానంది. ఎవరన్నా డాక్టరుంటే అక్కడ ఆయన్ని చూపించి తిరిగి వచ్చేస్తానని నచ్చచెప్పి, బండిలో ఎక్కి బైలుదేరాం. ఆరుతూవున్న చీర తడి నా చేతికి తగుల్తోంది. ఆమె దూరంగా జరుగుతోంది. నా చెయ్యికి ఆమె అరచెయ్యి తగిలింది. నొక్కి పట్టాను.

"హేమలత ఏదో అంది - నువ్వేమీ అనుకోకేం" అని చెయ్యి నొక్కాను. తీసేసింది.

"ఇంకెప్పుడూ మీ పేటలోకి రాను" అంది. బండి నిల్చింది. ధనం జయంని డిస్పెన్సరీలో దింపి, బల్లమీద పడుకోబెట్టాం. డాక్టర్ వస్తాడు కూర్చోమన్నారు. దొడ్డివైపు చెట్టుకింద కూర్చుంది కనకం.

అక్కడ నుంచి సముద్రం కనిపిస్తోంది, కెరటాలహోరు విని పిస్తోంది.

"కోపం వచ్చిందా?"

"నాకా? ఎందుకు ?"

"లోపల అంతగా ద్వేషిస్తోంది అనుకోలేదు. మన పరిచయం చెప్పావా ?"

"ఎబ్బే!"

"మరింకెవరైనా, ఏవో చెప్పి వుండాలి."

"నేనంటె అందరికీ లోకువే. సంసారులతో స్నేహాలకి పోకూ డదు."

"అయినవాళ్ళు, కానివాళ్ళు సావాసం కావాల నొచ్చుగా."

"అది సావాసం కాదని నాకు తెలీకపోతేగా. ఆ కాసేపు ఆ ఒళ్ళు కావాలి, డబ్బిచ్చి కొనుక్కున్న సావాసం - మీకు తెలీదు గనకనా?"

"నేనింకా జ్ఞాపకం వున్నానా?" అన్నాను. వెనక కాలేజీలో చదువు కునే రోజుల్లో ఆమెతో గడిపినరోజులు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"మీరెంత డబ్బిచ్చారో జ్ఞాపకం వుండే, ఇదిమాత్రం జ్ఞాపకం వుండదంటారా ?"

"డబ్బు ఖర్చయిపోతుంది."

"ఒళ్ళుమాత్రం పాడైపోదా ఏమిటి?"

"నా కళ్ళకి ఇప్పుడూ బాగానే వున్నావు" అన్నాను. పరిచయం వల్లనేమో, నాకు ఆమె కొత్తగా కనబడలేదు.

"ఆ ముక్క హేమలత ముందు అనగలరా?" అన్నది. డాక్టర్ వచ్చి పిలిస్తే లోపలికెళ్ళాం. ధనంజయాన్ని పరీక్షచేసి మందిచ్చాడు. వారిద్ద రినీ బండిలో ఎక్కించి స్టేషన్‌కి పంపించి, మళ్ళా నేను ఆలయానికెళ్ళాను.

ఆరాత్రి మాబసలోకి కనకం రాలేదు. రాత్రి నిద్రపట్టలేదు. బైట కుర్చీవేసుగుని స్టేషన్‌లో నిలబడ్డ ఇంజిన్‌కేసి చూస్తూ కూర్చున్నాను. హేమలత వచ్చింది.

"కనకంకోసం చూస్తున్నారా?"

"ఎందుకట్లా గంటావ్. ఆమె పట్టుకోకపోతే, బేబీ ఏమవును?"

"పాత స్నేహమా?"

"అవుతే ఇప్పుడు చేసేదేముంది?" కోపంతో లోపలికెళ్ళింది.

ఆ మర్నాడు ధనుష్కోడికి ప్రయాణం అయ్యాం. మా పెట్టెలోకి థర్డ్‌క్లాస్ పెట్టెలో వ్యక్తులు ఎవ్వరూ రాలేదు- ఇందిరతో కబుర్లు చెప్పే టందుకు శ్యామలతప్ప.

రైలు ధనుష్కోడి చేరేటప్పటికి, మధ్యాహ్నం మూడైంది. అక్కడ అంతా ఇసుక— మధ్య, అక్కడక్కడ చిన్న మొక్కలు, పొదలు— భూభాగం అంతతో సమాప్తం. చుట్టూ సముద్రం. బంగాళా ఖాతము, హిందూమహా సముద్రము, ఏకమయ్యేచోటు దూరంగా అలలు

కొన్ని తూర్పువైపుకీ, మరికొన్ని పడమరకీ వేగంగా ప్రయాణంచేస్తూ తలలు ఢీకొని కలిసి విడిపొయ్యే దృశ్యం భయంకరంగా వుంటుంది. ధనుష్కోడిస్టేషన్‌పక్క, ఒడ్డునే సింహళానికి ప్రయాణమయ్యే వోడ బైలుదేరడానికి సిద్ధంగా వుంది. రైలులో జనం దిగాక, మళ్ళా వెనక్కి వెళ్ళి, తూర్పుగా మరో లైన్‌లో రెండుఫర్లాంగు లవతల మాపెట్టెలను విడిచేసింది. అక్కడ సముద్రం ఒడ్డునే, కర్ర అడితీ, ఒక పెంకుటిల్లు వున్నాయి. కెరటాలు గోడకి తగులుతుంటాయి. నడుస్తుంటే పీతలు కాళ్ళ మధ్య అడ్డంగా కదిలి నీళ్ళలోకి జారుతుంటాయి. ఒడ్డుకి నాలుగైదు ఫర్లాంగులు నడవాలి. అక్కడే స్నానాలట. నడవలేనివాళ్ళు, ఎద్దుబండిలో వెడుతున్నారు. ఒక బండిలో, ధనుంజయుని, నాగభూషణంగారి భార్య విజయ, చిట్టెమ్మ, కనకం వెడుతున్నారు. అరగంటలో మిగతావాళ్ళం అక్కడికి చేరుకున్నాం. అక్కడ టీ దుకాణంవుంది. మంత్రాలు చెప్పే బ్రాహ్మణులున్నారు. బట్టలు మార్చుకునేందుకు రెండు పందిళ్ళు, తడకలతో కట్టిన మరుగుస్థలాలు వున్నాయి. స్నానాలు మంత్రాలు జోరుగా సాగుతున్నాయి. స్త్రీలు లోపలికెళ్ళకుండా, ఒడ్డునే కూర్చుని చెంబులతో నీళ్ళుతీసుకుని స్నానాలు చేస్తున్నారు.

నేనూ, హేమలత, ఇందిర, రామనాథం, శ్యామలరావు, కుడివైపున జనసమర్దంలేని చోటుకివెళ్ళి స్నానాలు చేస్తున్నాన.

"ఫస్టుక్లాస్‌వాళ్ళ స్నానాలుకూడా వేరే ఫస్టుక్లాస సముద్రంలో చెయ్యాలికాబోలు" అని చౌదరి అందరూ వినేటట్లు అన్నాడు.

"నేను మీతోనే వున్నానండోయ్" అన్నాడు కృష్ణమూర్తి.

"నేను వీరితోనే వున్నానండి" అన్నాడు థర్డ్‌క్లాస ప్యాసెంజర్ శ్యామలరావు.

"నేను ఏ పార్టీలోనూ చేరను. వేరే చేస్తాను" అని కనకం, కాస్త దూరంగావెళ్ళి, రెండడుగులు నీళ్ళలోకిదిగి స్నానం చేస్తోంది. ధనంజయుం మెల్లగా సాకుతూ అక్కడికెళ్ళి, ఒడ్డునకూర్చుని నీళ్ళుమీద జల్లుకుంటున్నాడు. నాగభూషణంగారి "రవి", "రమ"లు గంతులేస్తూ, ఆ చోటుకే వెళ్ళి నీళ్ళల్లో దిగారు. లోతుకుదిగకండి, అని టీకొట్టువాడు కేకపెట్టాడు

అక్కడ సముద్రం రెండుమూడు గజాలు దాటగానే లోతుట. "వెళ్ళకబ్బాయి" అని "రవి"ని పట్టుకున్నాడు ధనంజయం. "రమ" ఒకడుగు వేసి కెరటంపోటుకి ముందుకు పడిపోయింది. కేకలు వేసింది.

ధనంజయం లోపల కాలుపెట్టి ఆమె జడపట్టుకుని వెనక్కి పడిపొయ్యాడు. కనక వాళ్ళిద్దరినీ రెండు చేతులతో రొమ్ముకి నొక్కుకుని, ముందుకిగెంతి ఇసుకమీద పడింది జనం నలుగురూ పోగయ్యారు ఎవ్వరికీ ఏమీ జరగలేదు. ధనంజయంగారు మాత్రం కాసిననీళ్ళు మింగారు--దగ్గులు, దోకులు అయినాక కాస్త తేరుకున్నాడు.

"అంతకీ కారణం ఆ కనకం" అన్నాడు చౌదరి.

"పాపం, ఆవిడేం చేసింది-ఆవిడ లేకుంటే రమ ఏమవునో" అంది హేమలత. కనకంపట్ల మా ఆవిడ అమాత్రం సానుభూతి చూపడం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

కొందరం టీ త్రాగడంతో, టీ కాస్తా అయిపోయింది. సూర్యుడు నీళ్ళల్లో దిగిపోతున్నాడు-కెరటాల కొట్లాటచూసి రాజీ కుదర్చలేక విఫలుడై నట్లు. ఎరుపు కెరటాల శిఖరాన నురుగుని నీలంగా మారుస్తోంది. అది రంగుల కయ్యం- "నీలం" అనే కన్యకి విడాకులిచ్చి, పారిపోతున్న రంగుల ప్రియులు.

రైలు ఏడున్నరకి బైలుదేరుతుంది. అది తప్పితే, మళ్ళా తెల్లారితే కాని రైలులేదు. జనం స్టేషన్‌కి బైలుదేరారు. మరో ప్రయాణీకుల బృందం ఉన్న రెండు ఎడ్లబళ్ళనీ కట్టించుగుని వెళ్ళిపోయారు. తిరిగి వొచ్చి. ధనంజయాన్ని తీసికెడతా నన్నాడుట. మేం అందరం నడుచుగుంటూ స్టేషన్‌కి చేరేటప్పటికి ఏడుంపావైంది. అక్కడ టీ త్రాగాం. అందరూ పెట్టెలలోకి ఎక్కారు. ఏడున్నరైంది. తిరిగి వెళ్ళిన బండి రాలేదు. ధనంజయం, కనకం దిగడిపొయ్యారు. గార్డుని బతిమిలాడితే మరో పది నిముషాలు రైలు ఆపాడు. వాళ్ళబండి ఎంతదూరంలో ఉందో చీకట్లో కనబడటంలేదు. పాపం, ఆ ముసిలాయన, కనకం ఏమవస్థ పడుతున్నారో, ఏంచెయ్యాలి? రైలు కదులుతోంది.

"ప్రొద్దుట బండిలో వొస్తారులెండి, మీ రెక్కండి" అన్నాడు విశ్వపతి.

"నేను దిగపడిపోతా, పోనీ," అన్నాడు కృష్ణమూర్తి

"పట్టెడు రొంప జలుబుతో మీరేం చేస్తారు," అంది ఆయన భార్య ఇందిర.

"పోనీ, మీరుండిపోతారా?" అంది హేమలత. రైలు కదిలింది. హేమలత ఫ్లాస్కూ, బ్రెడ్ బాక్సు అందిచ్చింది. రైలు వెళ్ళింది. దిగులుగా ఉంది స్టేషన్. కెరటాలు ఒడ్డున పడి, విరహంతో రోదిస్తున్నాయి. మానవుడు, సమాజము అక్కడి ప్రకృతికి ప్రధానంగా తోచలేదు. నేను యదార్థమో, సముద్రం యదార్థమో- ఎవరు నిర్ణయించగలరు?

అట్లా అనుకుంటూ రెండు ఫర్లాంగులు వొచ్చేక ఎద్దుబండి ఎదురైంది. బండి నిలిచింది. కనకం దిగింది.

"ఇదేమిటి ఇట్లా వొచ్చారు? మావయ్య ఆయాసం ఎక్కువైంది. వెంటనే బండిలోకి ఎక్కలేకపొయ్యాడు. నేను బండివాడూ, లోపలికి ఎక్కించాం కష్టంమీద" అంది.

"రైలు వెళ్ళిపోయింది." అన్నాను.

"ఆ—మరెట్లా గిప్పుడు?"

"ఉదయాన ఆరున్నరకి బండిలో వెళొచ్చు. రాత్రి ఇక్కడే గడపాలి." అన్నాను.

బండి వెడుతోంది. ఆమె, నేనూ నడుస్తున్నాం. చుట్టూ చీకటి. చీకటికి భయపడని కారుమేఘాలు, కెరటాలతో కయ్యాని కన్నట్లు సముద్రపుటంచున మూగి సవాలు చేస్తున్నాయి. పైన నక్షత్రాలు, సాక్షుల మాదిరి నిశ్చలంగా మెరుస్తున్నాయి. సముద్రగర్భం ఒక మృత్యువులా నల్లగా ఉంది. దాన్నుండి కెరటాలు పారిపోయి మా పాదాలమీద పడి "రక్షించండి" అన్నట్లు మొరెట్టుగుంటున్నాయి. కానుకలుగా పీతలు- పెద్ద బండలంత,- కాళ్ళమధ్య పరుగులెత్తి కెరటంలో కలిసిపోతున్నాయి.

కనకం జుట్టు విడిపోయింది- ఆరబెట్టుకుంటోంది. జాకెట్టు భుజాన వేసుకుని, చీరకొంగు ఒంటిమీద కప్పుకుంది. మాటల్లేవు. మనిషి అనిశ్చ

లమై, మసగలాగై, కెరటాలమధ్య కరిగిపొయ్యే, ఒక భ్రాంతిగా సాగు తోంది. ఆమె–నేను, ఎవ్వరం? ఎక్కడికి పోతున్నాం? భాషలేదు, భావాలు లేవు–కాలికింద ఇసుక రేణువుల మాదిరి ఒడ్డున కదిలిపోతున్నాం. స్టేషన్ కొచ్చేశాం. ఫర్లాంగుదూరంలో గదుంది. మధ్యలో కర్రతో గోడ. దాని మీద మంచం. ధనంజయంగార్ని దానిమీద పడుకోబెట్టాం. తడిబట్టలు, తీసేసి, సంచి తలకింద దిండులా పెట్టాం. చలిగాలి మొదలెట్టింది. తలు పులు మూసేశాం. స్టేషన్‌మాస్టర్ గ్యాస్ దీపం ఇచ్చాడు. నేను డాక్టర్ కోసం బయలుదేరాను. ఊళ్ళో ఐదారుఇళ్ళు కనిపించాయి. టీ కొట్టుదగ్గర, పూరీలు దొరికాయి. డాక్టర్‌తో వచ్చేటప్పటికి పదైంది. ఆయన పరీక్షిం చాడు లాభం లేదన్నట్లు పెదవి చప్పరించాడు. హెమరెజ్. రక్త స్రావంట. చెప్పలేం అన్నాడు. రక్తం ఎక్కించాలిట. చేసేది ఏమీ లేద న్నాడు. ఏవో బిళ్ళలిచ్చాడు. బలవంతాన నోట్లోవేసి, మంచినీళ్ళిచ్చాం. ఒకటి మింగాడు ధనంజయం. కళ్ళువిప్పి మాకేసి చూశాడు. దీపం వెలు గులో కళ్ళు పెద్దవిగా, ఒకసైె చూసినట్లు భయంకరంగా ఉన్నాయి.

"ఎట్లా ఉంది?''

పెదవులు వికృతంగా కదులుతున్నాయి. అది నవ్వే యత్నం. డాక్టర్ వెళ్ళాడు. తెచ్చినవి తినమన్నాను కనకాన్ని. ఇద్దరం తిన్నాం. ఫ్లాస్కులో టీ తాగాం. ఆరిన జాకెట్టు జుట్టుముడి తలకింద పెట్టుకుని, గుమ్మంముందు పరుంది. కొంచెం దూరంగా బెంచిమీద నడుంవాల్చాను. అంతటా నిశ్శబ్దం. ధనంజయం మూలుగు, గురక వినబడుతోంది. ఏదో కల. సముద్రం మధ్యలో పడవ, తెరచాప చిరుగుతుంది మేఘాలు, ఉరు ములు, మెరుపులు; సముద్రం అడుగునుండి, అగ్నిపర్వతం ప్రేలినట్లు చప్పుడు; పడవ ముక్కలవుతుంది. ఒక్క ముక్కని పట్టుకుని ఆకాశం లోకి వెళ్ళిపోతాను. కొన్ని లక్షలమైళ్ళు వెడతాను. చంద్రమండలాన్ని దాటిపోతాను. రెండు మిలియన్ల మైళ్ళు దాటి వెడతాను. సూర్యకిరణం కర్రను, నన్నూ కాల్చేస్తుంది.

"అమ్మో!" అని కేక వినబడింది. త్రుళ్ళి బెంచిమీదనుండి పడ్డాను. కనకం పరున్న గుమ్మందగ్గర ఒక తలుపూడి పడింది. లోపలికి వర్షం

సూదులకిమల్లె పడి పొడుస్తోంది ఉరుములు, మెరుపులు, సముద్రం హోరుని ముంచివేసి, విజయం సాధించాయి. కనకం బ్యాటరీలైటు వేసింది. అది క్షణం వెలిగి నిలిచిపోయింది. లేచి ఊడిన తలుపుని నిల బెట్టి, ఇద్దరం అదిమి పట్టాము. పది నిముషాల్లో వర్షం నిలిచింది. గోడ అవతలకి వెళ్ళిచూశాను. అక్కడ లైటు ఆరిపోయింది. ధనంజయంగార్ని కదిపి నూపి పలకరించాను. ఏదో రోదన చేస్తున్నాడు. గుండెలు కొట్టు కుంటున్నాయి. మూలుగు వినబడుతోంది. ఒంటిగంటైంది. క్రింద నీళ్ళు. బెంచిమీద చేరాను. తల మోకాళ్ళమధ్య దాచుకుని కూర్చుంది కనకం, మళ్ళా నిశ్శబ్దం, భయం, చలి, మనస్సులో పెద్ద ఖాళీ-భారం. మరో మనిషి కావల్సి వచ్చింది. మనిషి ఒంటిగా పుడతాడు, ఒంటిగా పోతాడు. కాని, ఈమధ్యలో మరోప్రాణి లేకపోతే ఉండలేడు. ఒంటిప్రాణి అసం పూర్ణం కనకం ఒడిలోకి వాలిపొయ్యాను. ఆమె స్తనాలమధ్య చెంప వాల్చాను. చేతులు నడుంచుట్టూవేసి, వేడిని నాలోకి లాక్కుంటున్నాను. మెడ నోటికి తగుల్తుంది. రక్తం, మాంసం, వేడి, మెత్తదనం—జీవుడు కొట్టుకోడం— గుండెలో కదిలే ప్రాణం. వీటిని గట్టిగా కౌగలించుకుని, నా బ్రదుకుని యదార్థం చేసుకోడంకోసం: అదొక పెనుగులాట, అదొక జ్వాల; దహించి బ్రతికిస్తుంది. ఆమెతో సేస్తోంది తప్పించుకుంటోంది. ఇండియా రబ్బర్‌లా జారిపోతోంది.

"అమ్మో—విడిచెయ్యండి" అంది రహస్యంగా. కంఠంలో అస్పష్ట మైన నాదం— మాటలులేవు. ఇంకా ఇంకా జరుగుతున్నాను ఆమెని పెన వేసుకుని, కరిగి విరిగి ఐక్యం అయిపోతున్నాం. తోసేస్తోంది. బెంచిమీద నుండి కింద నీళ్ళల్లో పడ్డాను. నన్ను లేవదీసింది.

"మీరిల్లా పడుకోండి. వానకి బట్ట తడిసినట్లుంది. పిండేదా?" పిండు తోంది.

"ఒళ్ళు పట్టేదా? తలనొప్పా? జోకొట్టేదా? కాళ్ళుపట్టేదా?" ఆమెను దగ్గరగా తీసుకుని, అదరాలకు తాకాను.

"నమస్కారం పెడతానూ, పడుకోండి."

"ఏం ?"

"ఆ ముసలాయన అట్లా చావు బ్రతుకుల మీద వుండగా, మీరిట్లా గవచ్చా?"

"దానికీ, దీనికీ ఏం సంబంధం ?"

"చదువుకున్నవారు. పెద్ద కుటుంబంలో మర్యాదగా పెరిగినవారు— అట్లాంటప్పుడు ఆ ఆలోచన ఎట్లాగొచ్చిందండి మీకు? హేమలత దగ్గర లేబట్టేనా? ఆమె దగ్గర ఉన్నా, ఆమెతో మీరిట్లా గడపగలరా — ఎంత రాతి గుండెమీది!"

"నేనంటే ఇష్టంలేదా ?"

"ఇష్టం ఉంటే పెండ్లి చేసుకుంటారా?"

"నీ కిప్పుడు పెండ్లేమిటి?"

"మీకంటె రెండు మూడేళ్ళు పెద్దదాన్ని. నామీద మీకెట్లా ఇష్టం ఏర్పడిందో – ఈ ఒక్క గంటా ఇష్టం - మళ్ళా ప్రొద్దున్నకి మామూలే హేమలత భర్తగారు. ఆమెతో చెప్పేదా?"

"ఎవరి వృత్తి వారిది."

"ప్రేమించడం, ఇష్టపడటం నా వృత్తి కాదు. మీ ఆవిడగారి వృత్తి అది."

"మరి నీదేమిటి ?"

"డబ్బుకి శరీరానివ్వడం."

"డబ్బు కావాలా?"

"అంత ఇష్టంగా ఉంటే, శరీరం అడక్కుండా డబ్బివ్వండి."

ఆమె గదిలోంచి వెళ్ళిపోయింది. బైట తిరుగుతోంది. బెంచిమీద పడుకున్నాను. నీరసంగా వుంది. కడుపులో ఖాళీ ఏర్పడింది. అస్తిపంజరం ఏడుస్తోంది. మెదడులో ఆలోచన లేదు. కళ్ళు మూతలు పడ్డాయి. ఎవరో నుదుటి మీద చెయ్యివేసి లేపారు. భయం వేసింది. కనకం.

"కోపం వచ్చిందా?"

నేనేమీ మాట్లాడలేదు.

"హేమలతకి మీరంటే ఎంతో ప్రాణం, తెలిస్తే ఆమె కెట్లా ఉంటుంది ?"

"అవును, పాపం, పతివ్రతవు"

"కాదు, నిజమే. మనస్సులో ఉండొచ్చుగా."

"ఎప్పటినుంచో."

"మీబోటివారి సావాసమైంతర్వాత," అని నవ్వుతూ పక్కకివెళ్ళి ధనంజయాన్ని చూసివచ్చింది.

"ఇటురండి. కళ్ళుమూసినట్లున్నాడు," అంది. ఇద్దరం వెళ్ళి చూశాం. కళ్ళు మూశాడు. కాళ్ళు, చేతులు చల్లగా ఉన్నాయి. గుండె నిలిచిపోయింది. ముసిలాయిన అస్తమించాడు. ఇంక జీవితంలో పెనుగులాటలేదు. బైటకివెళ్ళాం. చీకటి విడిపోతూంది. కెరటాలు ప్రభాతగీతం ఆలాపిస్తున్నాయి. బద్ధకంతో పక్షుల కలకలం వినబడుతోంది. స్టేషన్‌లో జనం అలజడి ప్రారంభమైంది. మంత్రాలకి ఒకాయన్ని తీసుకొచ్చాను. డాక్టర్ దగ్గర సర్టిఫికేట్ తీసుకున్నాం. నలుగుర్ని డబ్బిచ్చి రప్పించాను. ఏడింటికి తీసుకెళ్ళాం. నాలుగు ఫర్లాంగులు నడిచాం. మంత్రాలు చదివారు. చితిపేర్చారు. విప్పంటించింది కనకం. మంటలో పొగ, కెరటంలో నురుగు ఆవిరై, రెండూ ఏకమై శూన్యంలో కలిసిపోయినాయి. తొమ్మిది గంటల బండిలో వెనక్కివెళ్ళి, మధురలో బస్సెక్కి, కన్యాకుమారి చేరుకున్నాం, ఆ రాత్రి తొమ్మిదింటికి.

o o o o

కన్యాకుమారి ఆలయం దర్శించి, సముద్రస్నానంచేసి మా గదికి చేరుకునేటప్పటికి ఒంటిగంటైంది. మా బస చిన్న హూటల్లో ఒక గది. నా గదిలో నేనూ, రక్షితలాల్, వారి సతీమణి రాజీబాయీ ఉన్నాము. భోజనం చేసి పడుకుని, మూడింటికి లేచాను. విశ్వపతి సుచీంద్రం ఆలయానికి బస్సు ఏర్పాటు చేశాడు. పదకొండుమైళ్ళు. అద్భుతమైన శిల్పాలు. ఇటీవల త్రవ్వి, పైకితీయబడిన పెద్ద ఆంజనేయస్వామి రాతిప్రతిమ. తొకలోంచి తీర్థంపడే ఏర్పాటు చేశారు.

ఆలయంలో వెనక నర్తనశాలగాఉండే మందిరం చూశాం. అక్కడ

స్తంభాలు మోగిస్తే వివిధ వాద్యాల నాదం వినబడుతుంది. అమధ్య తిరుచ్చి రేడియో నిలయంవారు, ఆ వాద్యాలు రికార్డు చేసుకుని వెళ్ళారుట. నా కన్నింటిలోకీ ఆ ఆలయంలో శిల్పాలు నచ్చాయి. వాటిలో ఒళ్ళు పుల కరింజేసే, సూక్ష్మమైన సౌందర్యంఉంది. ప్రేమంటే తెలియనివారు ఆ శిల్పాలనిచూస్తే ప్రేమించటం మొదలెడతారు. అది వాంఛతో, కామంతో, ఇంద్రియాలనుకదిపే ప్రేమ కావచ్చు. వాంఛనుండి విడగొట్టిన ప్రేమను నే నెరగను. అది ప్రాప్తిస్తే ధన్యుణ్ణి. అంతవరకూ, కళాసౌందర్యంలో తృప్తిపడితే తప్పులేదనుకుంటాను. తిరిగి గది కొచ్చేటప్పటికి ఎనిమి దైంది. హూటల్లో నాలుగు మెతుకులు తిని, గది కొచ్చేటప్పటికి తొమ్మిది దాటింది. గుమ్మంలో విశ్వపతి నిలబడి మందహాసం చేశాడు.

"క్షమించాలి, లక్ష్మణమూర్తిగారూ. ఈ పూటకి కనకం, మీ గదిలో ఉంటుంది. ఇప్పుడే వచ్చారువాళ్ళు. ధనంజయం చనిపోయాడుట. అంత్యక్రియలుచేసి ఇప్పుడే వచ్చారు. మధుసూధనంగారు ఫస్టక్లాస్ ప్యాసెంజర్ గా—వారికి పెద్ద హూటలు గదిలో చోటుంది. మీరు కవులు...."

ఇంకా వాక్యం పూర్తవకుండానే, కనకం గదిలో కొచ్చేసింది.

"మన లక్ష్మణమూర్తిగారేగా—ఆయనకి ఏ అభ్యంతరం ఉండదు —వారి మొహాన చిరునవ్వు తాండవిస్తూ ఉంటుంది. ఏం! లక్ష్మణమూర్తి గారు...."లోపలికొచ్చి, సంచీలో దుస్తులు తీసుకుని ధరించి, జడ అల్లు కుని, "తినేటందుకు ఏమన్నా ఉందాండి. మంచి ఆకలిగాఉంది," అన్నది. ఏం చెయ్యాలోతోచక అటూ, ఇటూ చూస్తున్నాను. రక్షితలాల్‌గారు పొట్లంవిప్పి, నాలుగు పూరీలు పెట్టాడు. రెండు నారింజ పండ్లిచ్చాడు. అవి తిని, మంచినీళ్ళుత్రాగి, ధనంజయంగారి చివరి ఘడియలు వర్ణించింది. ఆమె కబుర్లు—కళ్ళ కదలికా, చేతులు తిప్పడం, మెడవంచి వూగిస లాడుతూ మాట్లాడుతూంటే సుచీంద్రం ఆలయంలో ఒక బొమ్మ ప్రాణం పోసుకుని మాట్లాడుతున్నట్లనిపించింది. నా మంచంమీది రగ్గులాగి, కింద పరుచుకుంది. మా పెట్టెలో రోజూ చూస్తూనేఉన్నా. కాని, ఆ సమయంలో కొత్తగా కనపడింది. ధనుష్కోడిలోపొందిన విషాదకరమైన అనుభవం

వల్ల, పెరిగి, నిజాయితీ, నిబ్బరం సూచించేమొహం వింతగా కనబడింది. ఆమె కళ్ళు మూసుగుంది. శ్వాస వినబడుతూంది—వక్షం కెరటంలా లేచి పడుతోంది. ఆమెని గురించి ఎన్నో విన్నా—బొత్తిగా గిట్టని శ్యామల రావు చెప్పినవి. అతన్నిద్వేషించడం కూడా ఒకకారణమే, ఆమెపట్ల కుతూహలం ఏర్పడడానికి, పతితులపట్ల ఉన్నంత కుతూహలం శీలులపట్ల ఉండదేమో. ఈ భావాలన్నీ వూహలో తిప్పుతూ, ఒక ఖండ కావ్యం వ్రాయ మొదలెట్టాను. పది నిముషాలవగానే లేచి కూర్చుంది కనకం. అటూ ఇటూ చూసింది.

"ఏమండీ—అవతల కెళ్ళాలి. కాస్త సాయంగావచ్చి ఎటో చూపిస్తారా?" అంది.

ఏం చెయ్యను. వెళ్ళాను. చూపించి, బైట నిలబడ్డాను. మళ్ళా వచ్చి పడుకుంది. "మీరెంత మంచివారండి," అని దుప్పటి కప్పుకుంది. నే మొదలెట్టిన గేయం పూర్తి కాలేదు. స్విచ్ నొక్కి పడుకున్నాను.

ఐదు కాకుండానే లేపింది. సూర్యోదయం చూద్దాం రమ్మంది. రాజీబాయి 'నేను రాలేను—మేం చూశాం, మీరెళ్ళండి, అంది. మొహం కడుక్కొని బైలుదేరాం. చాలా చలిగాఉంది. మాటలు రావడంలేదు. నాలుగు ఫర్లాంగులు నడిచి సముద్రం ఒడ్డుకి చేరుకున్నాం. చీకటి పట్టు వీడుతోంది. అలలమధ్య పెద్దపెద్ద రాతిబండలు పారా వేస్తున్నాయి. నీళ్ళల్లోకి నడిచి వెళ్ళి "రండి ఇక్కడ కూర్చుందాం," అని తను ఒక రాయిమీద కూర్చుంది. నేను కాస్త దూరంగా నిలబడ్డాను. "రండి" అని, చెయ్యి పట్టుకులాగి కూలేసింది.

"నేనేమన్నా చేస్తానని భయమా?" అంది కొంటెగా చూస్తూ. వెలుగు రావడంతో నా సిగ్గు తొలిగినట్లైంది.

"నువ్వుకాదు, నేనేమన్నా చెస్తానేమోనని భయం" అన్నాను నవ్వేసింది.

"మీరు కవులటగా. కవులకి అ ధైర్యం లేదులెండి. నే నెరుగుదును."

"ఎట్లా ఎరుగుదువు?"

"ప్రక్కన పడుచుపిల్లుంటె పద్యాలు చెప్పారట. పద్యాలు చెప్పే వారు పడుచుపిల్లకేసి చూడరుట. అవునా?"

"చాలా అనుభవం ఉందే."

"నా మొహం. వారు వీరూ చెప్పుకుంటుంటే విన్నావి. సరదాగా వుందా?"

ఏం చెప్పను? నాకెందుకో భయంవేసింది. ఆమె చెప్పినట్లు నాకు ధైర్యం లేదనిపించింది.

"రాత్రి నిన్ను గురించి ఒక గేయం మొదలెట్టాను. తెలుసా ?" అన్నాను.

"గేయమేనా—చెప్పండి, విని సంతోషిస్తాను."

గొంతు సవరించుకుంటున్నాను. ఆమెకి అర్థమవదు. అర్థంకూడా విడమరిచి చెప్పాలి. అల్లా చెప్పగానే దాని అందం చెడుతుంది. ఆ సంగతి కూడా ఆమెకి తెలీకపోవడం అదృష్టం అనుకున్నాను.

"ఆహా—అటుచూడండి-సూర్యభగవానుడు" అని చేతులు జోడించి నమస్కరించింది. ఎర్రగా బింబం అంచుపై కొచ్చింది. పైన చోద్యం చూడ్డానికి వస్తున్న మేఘాలని తన సౌందర్యంచూసి సిగ్గుపడేటట్లుచేసింది. మేఘాల మొహాలు, సిగ్గుతో ఎర్రబడ్డాయి. జోహారులిస్తూ, కెరటాలు ఎగిరిపడుతున్నాయి. మూడు సముద్రాల అలలు దూరంగా జరుగుపుతున్న సమరం కాసేపు నిలిపి, దూరంగా ఎరుపుతో ఏకంచేసి సంధి కుదిర్చింది సూర్యబింబం. ఎరుపుతో రాతిబండలు విర్రవీగి, కెరటాలని క్రూరంగా గెంటివేస్తున్నాయి.

ఎరుపుతో కనకం మొహం పుష్పంలా విప్పుకుంది. కళ్ళు వెలుగుతో చెలిస్తున్నాయి. వక్షం పొంగిపోతోంది. వాటిమధ్య కిరణం కత్తిలా దూసుకుంది—మరెక్కడా చోటులేక.

"ఏదీ దానందం వర్ణిస్తూ పద్యం చెప్పండి"

నే మళ్ళా గొంతు సవరించుకుంటున్నా. ప్రబంధ కవుల వర్ణనలు జ్ఞప్తికి తెచ్చుకుంటున్నా. అది పఠించే భాగ్యంలేదు. మేఘాలు అత్యుతగా

బింబాన్ని కమ్మేశాయి. ఎరుపు పోయింది. ఎరుపు బూడిదయింది. శ్మశానంలో గోరీలల్లె రాతి బండలు మిగిలాయి.

"పూర్తిగా చూశ్చేదు. అదృష్టం లేదు." అనిలేచింది. అల్లా నడుచుకుంటూ మధ్యలో హోటల్లో టిఫిన్ తిని, కన్యాకుమారి ఆలయం దర్శించాం. లోపలన్నీ దీపాలు — వెయ్యో, లక్షో లెక్కించ లేను. ఆమె మూర్తి ఎడతెగని యవ్వనానికి సాంకేతికం. కనకం సాష్టాంగ ప్రణామం సల్పింది. తర్వాత గాంధి స్మారక మందిరం చూశాం. అదొక అందమైన భవనం. మధ్య చదరపు ఆకృతిగల రాతిఫలకం ఉంది. మహాత్ముడు పుట్టినరోజున—అక్టోబర్ రెండవ తేదీన, పైన కంతలోంచి సూర్యబింబం, గుండ్రంగా బంతిలా, ఆ రాతి ఫలకం మధ్యలో పడేటట్లు నిర్మాణం చేశారు! కనకం ఆ ఫలకంమీద పడుకుంది. లేచింది. నమస్కరించింది. స్నానాలుచేసేచోటుకి చేరుకున్నాం. అక్కడ జనం ఎవ్వరూ లేరు. ఒక పెద్దరాతి గుట్ట నీళ్ళల్లోకి పాకింది. అవతలవైపు కూడా ఎవ్వరూ జనంలేరు. కనకం నీళ్ళలోకి దిగింది.

"హాయిగాఉంది. రండి," అంది. నాకు చలేస్తోంది. వెళ్ళలేను.

"మీరు స్నానంచేసిరండి," అని అరిచాను.

"నన్ను మీరు అంటున్నారే-ఎంతమంచివారండీ. మీకు రోజూ ఇంత మంచి చలి దొరకదు. సిగ్గుపడుతున్నారే. ఆడదానికిమల్లే," అంటూ కెరటంమీది తుంపరని నామీద పడేటట్లు చేత్తో కొట్టింది.

"తుడుచుకునేందుకులేదు. మీరు కానివ్వండి." అన్నాను.

"నా చీరుందిగా సంచీలో" అని పరుగెత్తుకుంటూ వచ్చి చెయ్యి పట్టుకుని నీళ్ళల్లోకి లాగింది. విదిలించుగుని, దూరంగా జరిగి కెరటాల మధ్య కదుల్తున్నాను. ఆమె లోతుకి వెడుతోంది. "వెళ్ళద్దు," అని కేక వేశాను. రాయి తగిలి వెల్లికిల పడింది. అటువెళ్ళి చెయ్యి పుచ్చుగుని లేవనెత్తాను.

"మీరు లేకపోతేచద్దును," అని రాతిబండమీద కూర్చుంది. కెరటాలమీదపడ్డ కాంతి ఆమె వక్షంపైన పడుతోంది. వెండి తీగలమాదిరి,

రంగు తీగెలు వంకరలుతిరిగి, బంగారపు పంజరంలో పక్షివలె కిలకిల నవ్వుతోంది.

"ఇల్లా హాయిగా ఇక్కడే ఉండిపోవాలనుంది," అంది. మళ్ళా నీళ్ళల్లోకి దిగి నావైపు నడిచి వస్తోంది. నా రెండు చేతులమధ్య ఇమిడింది. అప్రయత్నంగా నా చేతులు ఆమె నడుం చుట్టూ బిగియడం పూర్తవకుండానే తొలిగించి దూరంగా వెళ్ళింది.

"మీరు మంచివారు. మీ జోలికిరాను. ఆడది నిజంగా ఏమనుకుంటోందో తెలిస్తే, మొగాళ్ళు మరింత తెగింపు చేసేవారు. అవునా లక్ష్మణమూర్తిగారూ?"

ఒడ్డుకివెళ్ళి సంచిలో బట్టలుతీసి, చీర మార్చుకుంటోంది. తడి చీరలోంచి ఒంపులో ఒంపులు స్ఫుటంగా కనబడుతున్నాయి.

"ఇటు చూడకండి. పదేళ్ళక్రితం అయిఉంటే, మీరల్లా దూరంగా కూర్చుని ఉందురా. ఇంధ, చీర-తుడుచుకోండి," అని మరో చీరమీద పడేసింది. బట్టలు ఆరుతున్నాయి. జడవిప్పి, పిండి మడికింద కట్టింది. రవిక నెత్తిన వేసుకుని ఎండపెడుతోంది.

నేను గట్టుమీదికి వెళ్ళాను. విశ్వపతి ఒక్కడూ నడుచుకుంటూ వచ్చి నా ముందు నిలబడ్డాడు.

"కనకం లాక్కెళ్ళిందంటగా!" అన్నాడు.

"చూపిద్దామని."

"మీరు చూసేదేమిటి-డబ్బిస్తే అదే చూపెడుతుంది?"

"ఏమిటా మాటలు. కనకం ఎవరనుకున్నావు?"

"లేచొచ్చింది-లేవదీసుకెడుతుంది-నీకు దాంతో ఏమిటయ్యా."

నేను మీదికెళ్ళాను. వెర్రికోపం వచ్చేసింది. విశ్వపతిని తన్నాలనిపించింది. ఈలోగా కనకం వచ్చింది.

"వింటున్నావే విశ్వపతిగారు-టిక్కట్టు కొనుక్కునే వస్తినిగా రైల్లో. మీరేం పూరికే తీసుకురాలేదు."

"తీసుకొచ్చాను. అనుభవిస్తున్నాను. నలుగురూ తిట్టిపోస్తున్నారు. ఈయనన్నైనా—" ఒళ్ళు మండింది. చెయ్యి చాచి సాగదీసికొట్టాను. మధ్య

అడ్డు తగిలిన కనకం చెంపకి తగిలి, బాధ సూచిస్తూ కేకపెట్టింది.

విశ్వపతి ఇంకెప్పుడూ అనను, లెంపలేసుకుంటా అని వెళ్ళి పొయ్యాడు.

"తగిలిందా పాపం. మీరెందు కడ్డుపడ్డారు. వాడికి కావాల్సిందే."

"పాపం, అతని తప్పుమాత్రం ఏముందిలెండి. అందరిలాగా వాడూ మనిషే," అంది.

"మరేం పెద్దగా తగల్లేదుకద—చూడనీ" అని ఆమె బుగ్గ నిమి రాను. ఆమెకళ్ళంట నీళ్ళు తిరుగుతున్నాయి. తుడిచేసుకుంది.

"నే నెందుకు ఏడవటం? వెర్రిపిల్లని," అని నవ్వుతోంది. రాళ్ళ మీద పేర్లుచెక్కుతున్న కుర్రాడిని కేకేసి, మా ఇద్దరిపేర్లూ ఆ బండమీద చెక్కమంది. వాడు చెక్కాడు.

"అల్లా పైనాకిందా కాదు పేర్లుచెక్కడం. పక్కపక్కనే." నాగ భూషణంగారి కుటుంబం, మరికొందరు రైలుమిత్రులు ఒస్తున్నారు. వాళ్ళలోకలిసిపోయ్యాము. ఆ సాయంత్రం అందరం, బస్సులో, తిరువ నంతపురం ప్రయాణమయ్యాము.

° ° °

"మా పెట్టెలు తిరువనంతపురం చేరడానికి ఒకరోజు ఆలస్యమై నందున మేం మరోరోజు అక్కడ గడపాల్సివచ్చింది. అక్కడ పద్మనాభ స్వామి ఆలయం, ఆర్టుగ్యాలరీ, బీచి, తోటలు చూశాక ఇంక చూడ వల్సినవేవీ కనపడలేదు. ఇందిర ఇంక తిరగలేనంది. ఒంట్లో బాగాలేదు. నాగభూషణం పరీక్షచేసి మందిచ్చాడు. హాట్ కాఫీతాగి రెస్టుతీసుకోమన్నాడు ఒకచుక్క బ్రాందీ ఇప్పిస్తే మంచిదన్నాడు. ఊళ్లో తిరిగి, అది దొరికే వయనం తెలుసుకుని బ్రాందీబుడ్డి సంపాదించాను.

"నన్నడగలేకపోయ్యావా కృష్ణమూర్తి. అంతశ్రమ దేనికి?'' అని రాఘవయ్య సూట్‌కేస్‌లోంచే రెండుబుడ్లు-ఒకటి విస్కీ-బయటికితీసి, కాస్త పుచ్చుకుని, లోపల పెట్టేశాడు. మందుప్రాయంగా నన్నూకాస్త పుచ్చుకోమని సంజ్ఞ చేశాడు. నిద్రపోతున్న ఇందిరను చూసి వద్దన్నట్లు తల పంకించాను. భార్యతో యాత్రకి బయలుదేరితే కొన్ని సరదాలు వదిలేసుకోవాలి. భక్తిమార్గంలో కుంటుకుంటూనైనా నడుస్తున్నట్లు నటించాలి. ఇందిర ప్రోత్సాహంమీదనే ఈ యాత్రకి బయలుదేరాను. కాని మేం ఏం చూడదల్చామో మాకే తెలీదు. ఒకచోటుకి బయలుదేరేవరకూ ఒకటే హడావుడి. తీరా వెళ్ళాక, వెనక్కి-వెళ్ళే హడావుడి-పదిలంగా చూసి ఆనందించిన స్థలం నాకు గుర్తులేదు. రైల్లో వెడుతూ, కిటికీ అవతల జారిపోతున్న ప్రకృతిదృశ్యాన్ని చూస్తూ, సమయానికి మంచికాఫీ, మంచి భోజనం, బద్ధకంగా పత్రికచదవడం. మధ్యమధ్య తోటి ప్రయాణీకుల అలవాట్లు, అవస్థలు గమనించడం, వారు మనకేసి చూస్తున్నది మనం గమనించనట్లు మొహం తిప్పివెయ్యడం, వారు చూడకుండా వారికేసి చూస్తూ, మళ్ళా చూస్తున్నామని వారికి తెలిసేటట్లు సూచించడం, రైలు నిలిచినప్పుడు, ప్లాట్‌ఫారమ్‌మీదదిగి ఏదో కొనడం, తినడం-థర్డ్‌క్లాస్ పెట్టెలో వారి తమాషాలుచూసి వినోదించడం—నాకు బాగున్నవి ఇవి-చాలా రోజుల్నుంచి చూస్తూ అలవాటయిన మధుసూధనం, హేమలత, "డెవిల్ జేబీ"-రామనాధం పూర్తిచెయ్యని పెన్సిల్ చిత్రాలు-నువ్వూ ఇవన్నీ చూస్తూ వినోదిస్తున్నావుగా—అని ధ్వనించేటట్లు ఇందిరకేసి చూడడం, ఆమె కొత్త చోటు చూసినప్పుడు తన ఆహ్లాదాన్ని మొహంలో ఎల్లా ప్రకటిస్తుందో గమనించడం-ఇవికూడా విసుగ్గా తోస్తున్నాయి. మొదట్లో చాలా రోజులు మా పెట్టెలో కనకం వుండేది. ఇప్పుడు రావడం మానేసింది. ఆవిడుంటే కాస్త కాలక్షేపం అయ్యేది. ఏదో వాగుతూవుంటుంది. అతిశయోక్తిగా ఆశ్చర్యాన్ని ప్రకటిస్తుంది. ఏదన్నా చూసినప్పుడు, ప్రతీదీ అద్భుతంగా

గొప్పగా, "మజాగా" వుంటుందనేది. విలువల వ్యత్యాసాలు, సూక్ష్మమైన తేడాలు ఆమెకి తెలియవు. మనిషిని రెండెట్టి గుణించినట్లు-ఆమెకంతా వింత, విడ్డూరమూనూ, ఇప్పుడు ఆ కాలక్షేపంకూడాలేదు. మధ్యాహ్నం రెండింటికి మా రైలు బయలుదేరుతుంది. ఓపిక, డబ్బు. ఉత్సాహంవున్న వాళ్ళం కొందరం. మరొక్కసారి వూరుచూద్దామని బయలుదేరాము.అక్కడ చేతిపనుల ప్రదర్శనశాల చూద్దామన్నాడు నాగభూషణం. రక్షితలాల్, జోగారావుకూడా బయలుదేరారు. మాకంటె ముందే అక్కడ చేరారు చెట్టి దంపతులు, రామనాథం, కనకం. వాళ్ళు కర్రఏనుగులు, చోళీలు కొన్నారు. నేను మంచి గంధపుసామాన్లు బేరం ఆడుతున్నాను. రక్షితలాల్ ఒకటోపీ, చేతికర్ర తీసుగున్నాడు. కర్రతో చెక్కిన మళయాళం స్త్రీ బొమ్మ ఒక టుంది. నాగభూషణానికి అది కొనాలనుంది. దానివెల నలభై.

"డబ్బు మిగలదేమో" అన్నాడు. చెట్టిగారు అప్పుగా కావాలంటే ఇస్తానన్నాడు.

"ప్రస్తుతం ఫరవాలేదనుకోండి. అవసరంవస్తే మాట. ఆ ధీమా చూసుకుని ఆ బొమ్మ కొన్నాడు నాగభూషణం. కనకం చెవికి కేరళ స్త్రీలు తగిలించే బరువైన కమ్మలు బేరమాడుతోంది. అవి చదరంగావుండే నాలుగు గుండ్లతో ఇమిడ్చి రెండంగుళాలు కిందికి వ్రేళ్ళాడే కమ్మలు. బంగారంనికావు. ఇరవై చెప్పాడు. చెవులకి పెట్టుకుని చూసుకుంటోంది.

"బరువుకి మీ చెవిజారి తెగిపోతుంది" అన్నాను.

"ఎప్పుడూ పెట్టుకోను. తలంటు పోసుకున్నాక అద్దంలో చూసుగుని మళ్ళా దాచేస్తాను. బాగున్నాయా?" అని అడిగింది.

కొట్టాయన, మేమూ అద్భుతంగా "మజాగా" ఉన్నాయన్నాము.

"అచ్చంగా కేరళ స్త్రీలాగున్నావు" అన్నాను.

"చెవికి పెద్దకంత మినహా" అన్నాడు చెట్టిగారు.

చిట్టమ్మ "వూరుకోండి" అన్నట్లు ఆయన చొక్కా వెనక్కి లాగింది.

"అబ్బో, ఇరవై రూపాయలే" అంది కనకం.

"మీకు చాలా బాగుంది. సంకోచించకండి. డబ్బా? ఉండనివ్వండి" అవి ఒక పాతిక చేతులో పెట్టాను. మందహాసంతో తీసుకుని కమ్మలు కొనుక్కుంది.

"ఇవాళ ఉషార్‌లో ఉన్నారు కృష్ణమూర్తిగారు!" అన్నాడు చెట్టి.

"ఖర్చులకే కదండీ ప్రయాణాలు" అన్నాను.

కుంకుమభరిణ కూడా కొంది కనకం. పచ్చ కుంకుమ పాపిట మధ్యలో పెట్టుకుంది.

"ఇప్పుడు అచ్చంగా కేరళ మనిషే" అన్నాడు జోగారావు. అందరం టాక్సీలు చేసుగుని స్టేషన్‌కి చేరుకున్నాం.

ఇందిర మందు పుచ్చుగుంది, బ్రాందీ ముట్టనంది. ఆ వాసనదోకుట. సీసా గిరవాటెడతానంది. రాఘవయ్య దగ్గర తీసుకున్న రెండు బుడ్లూ మధుసూధనంగారి పెట్టెలో దాచాను. పడుకుని నిద్రపోతానంది. రైలు కదిలింది. పక్కస్టేషన్ చేరేటప్పటికి నిద్రపోయింది. ఏమీ తోచక థర్డ్ క్లాస్ పెట్టెలోకి చేరాను. అక్కడ గంద్రగోళంగా ఉంది. యాత్ర కార్యక్రమం అధిపతి విశ్వపతి, క్రితం రాత్రే తొందరపనుందని వెళ్ళిపోయ్యాడుట.

"మమ్మల్ని నట్టేట్లోదించి వెళ్ళాడు. ఏమనుకున్నాడు. ఈ ఏర్పాట్లన్నీ ఎవరు చేస్తారు? సంజాయిషీ ఎవరు చెప్పాలి? ఉదయం టిఫిన్‌లో ఉప్పు తగలెయ్యలేదు. ఈ సీటు బీటలు తీసింది. ఈ ఫాన్ తిరగడం మానేసింది. ముందు డబ్బు చేతిలో పెడితే ఇంతేననుకోండి." అని విశ్వాన్ని ఉద్దేశించి వాపోతున్నాడు పద్మనాభం.

"నేను ఉన్నాను కదండీ—అంతా నన్నే చూసుకోమన్నాడు.

ఇప్పుడు మీకేం లోటొచ్చిందీ— ఉప్పంటారా- పై స్టేషన్‌లో బస్తాడు తెప్పించనూ- ఈలోగా కృష్ణమూర్తి పంతులుగారి టేబిల్ సాల్ట్ ఉండనే ఉంది." అని పంటాయన విఠలయ్య నచ్చజెపుతున్నాడు.

"ఎవరికి వారే యమునా తీరే" అన్నాడు లక్ష్మణమూర్తి. కోయం బత్తూరు, అక్కడనుండి ఊటీ ప్రయాణం ఉందిట. ఇంకెక్కడికీ వొద్దు, తిన్నగా కొంపకి చేరుకుందాం- అని అధిక సంఖ్యాకులు తీర్పు చేశారు.

"దీని కంతకీ కారణం, కనకం" అన్నాడు పద్మనాభం.

"మధ్య నేనేం చేశానండోయ్?" అంది కనకం.

"నువ్వు ఆ ఫస్ట్‌క్లాస్ పెట్టె వారితో సావాసం చేశావు. ఆ అలవా ట్లన్నీ మా కయ్యాయి. వాటిని సమకూర్చలేక, మన పోరు పడలేక ఉడా యించాడు విశ్వపతి" అన్నాడు.

"మర్యాదగా మాట్లాడండి. అదుగో చెట్టంత మనిషి కృష్ణమూర్తి గారు ఇక్కడే ఉన్నారు. మన అలవాట్లు వారికి మాత్రం అబ్బలేదనా. ఎన్నిసార్లు ఆదుకున్నారు? రేడియో యిచ్చారు. బ్యాటరీలైటిచ్చారు. ఎన్నో సార్లు పాలు సర్దుబాటు చేశారు. కప్పుకునేందుకు లేకపోతే రగ్గు ఇచ్చారు. ఇదా మీ కృతజ్ఞత?'' అంది.

"అవన్నీ ఎవరికోసం ఇచ్చారు? ఎందుకిచ్చారు?" అన్న ప్రశ్నతో వాదం రేగింది. అందరూ మాట్లాడ్డం సాగించారు. నేను పత్రిక అడ్డం పెట్టుగుని బైట దృశ్యం చూస్తున్నాను. అందమైన ప్రకృతి. దూరంగా అప్పుడప్పుడు సముద్రం కనబడుతుంది. కొబ్బరితోటలు, భారీ చెట్లు, చుట్టూ మట్టిగోడ- మధ్య విశాలమైన తోట, దాని మధ్య పూరిగడ్డి ఇల్లు.

స్త్రీలు కష్టించి పనులు చేస్తున్నారు. వారికి రవికెలు లేవు. లుంగీలా నడుంకి కాస్త బట్ట వ్రేలాడుతుంది. ఆకర్షణీయమైన శరీరాలు-నల్లగా, ఎర్రగా చామనఛాయ శరీరాలు. నాగభూషణం కొన్న కర్రబొమ్మ నకలు. ఆ చెట్లు మధ్య నీడలలో, సూర్యరశ్మి సోకినచోట వెలుగుతూ ఒంటిమీద ఒంపులమధ్య నీడలు పడుతూ. ధాన్యం దంచేవారు, కొబ్బరి చెట్లెక్కే-

వారు, విత్తనాలు వేసేవారు, వూడ్చేవారు, పశువులని మేపేవారు, అట్లాడే వారు, పద్యాలు పాడేవారు- ఏదో పెళ్ళి, పెద్ద గుంపు-అక్కడ చెట్లమధ్య ఉయ్యాలపై వూగుతున్న కన్యలు, పరుగులెత్తే పిల్లలు, కొబ్బరిపీచులాగి ఎండబెట్టే వృద్ధులు- మధ్య సముద్రం నీరు సరస్సులా ప్రత్యక్షం-వాటి లోంచి కాలువలు— పడవలమీద బెస్తవాళ్ళు- ఇక్కడ చేపలు పడు తున్నారు. కాలవలో, చల్లటి నీళ్ళలో స్నానాలు, ఈతలు- కండలు తిరిగి, గుండ్రనై, నిండైన స్త్రీల సౌందర్యం- ఎందరెందరు స్త్రీలో-మొగాళ్ళు ఎక్కువగా కనబడలేదు- అందరు స్త్రీలూ. ఒక్క స్త్రీ స్వరూపంలా, ఒక స్త్రీ శక్తిలా ప్రకృతినంతా అలుముకుని, లొంగదీసుకుని, రాణులై, సతీ వులై, ప్రాణులై, సౌందర్యాన్ని పదినెలలు మోసి కనే స్త్రీలు, వారున్న స్థలాలు, తెరమీద సినిమాస్కోప్ ప్రకృతిదృశ్యంలా జారిపోతూ, నా మనస్సుకి గాలంవేసి లాక్కుపోతుంటే పోనివ్వక క్షుద్రజగత్తులోకి మాట లతో, తిట్లతో, అసూయలతో, పగలతో లాక్కుపోయి, బంధించి పడేస్తు న్నారు తోటి ప్రయాణీకులు. నాకిక్కడ ప్రశాంతత లేదు. ఉండడం క్షేమంకాదు. పక్క పెట్టెలోకి వెళ్ళబోతుండగా ట్రాన్సిస్టర్, బ్యాటరీ లైటు, రగ్గు ఇచ్చివేసి శెలవు తీసుకుంటానంది, కనకం.

"ఏం తొందర. చివరలో ఇవ్వొచ్చు." అన్నాను.

"ఇవి నా దగ్గరుంటే నన్ను బ్రతకనియ్యరు."

"నిన్నెవరన్నారమ్మాయ్. పల్లెత్తుమాట అనలేదు. లోకంతీరు, ఫలానా అని చెప్పాను. అంతే. అవన్నీ ఉంచుగో- వూరేగు, మధ్య మాకేం...."

నేనింక వినలేదు. అవి తీసుగుని నా పెట్టెలోకి వెళ్ళాను. ఇందిర నిద్రపోతోంది. లేపి, కాఫీ ఇచ్చాను. కొల్లాన్ ఇవతల స్టేషన్ మయ్యనాడు విడిచింది రైలు. ఎత్తున, కొండలమీది నుంచి వెడుతోంది. పెద్ద పెద్ద కొండలు. కింద ఎంతో లోతుగా లోయలు, మధ్య కాలువలూ, కొండలమీద పచ్చటి చెట్లూ. మేఘాలు, తుంపర మంచుపొరలా శిఖరాలని

కప్పుతున్నాయి. కొండ దిగువున చిన్న గుడిసెలు. తొంగిచూస్తే, కాలువ ఒడ్డున, పడవలో ఇద్దరు పిల్లలు ఆడుకొంటున్నారు- చల్లటి, పచ్చటి నీడలు. సూర్యరశ్మి తడిగాడిగా పడుతోంది.

మయ్యనాడ్‌లో కాఫీ ఫలహారా లయ్యాయి. ఇరావిపురం అన్న చిన్న స్టేషన్ దగ్గర రైలు నిలిచిపోయింది. అక్కడ నుండి కొల్లాన్ వెళ్ళే రైలుమార్గం, కొంతభాగం వర్షాలకి చెడిందిట. రిపేర్లు పూర్తవడానికి, రెండు మూడు గంటలు పట్టొచ్చుట. అందుచేత, మా టూరిస్టు పెట్టెల్ని, సైడింగులో మూడు ఫర్లాంగుల దిగువలో విడిచేసింది ఇంజిన్. అందరం జైటకొచ్చాం. గుంపులు గుంపులుగా చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు టిఫిన్ తింటున్నారు. జాలయ్య, శంకరం చదరంగం మొదలెట్టారు. చెట్టుకింద చల్లటిరాళ్ళమీద కండువా పరచి, ఒక బృందం పేకాట మొదలెట్టింది. "రవి" ఫస్ట్‌క్లాస్ పెట్టెలో చేరి రేడియో పెట్టుగున్నాడు. విశలయ్య టీ పెడుతున్నాడు. ఇందిర కాసేపు పచార్లుచేసి, బండిలోకెళ్ళి పడుకుంది. హేమలత బేబీని ఆడిస్తోంది. దూరంగా సైడింగు దిగువలో ఒక ట్రాలీ ఉంది. అక్కడికెళ్ళి కూర్చుంది కనకం. నేను, నాగభూషణం, జోగారావు బుడ్లున్న బాగ్ తీసుకుని దూరంగా నడిచి వెళ్ళాం. ఐదు దాటింది. సూర్యుడు కొండవెనక ఆకులమధ్య కన్ను గీటుతున్నాడు. బుడ్డి పైకి తీశాం. అక్కడ కనకం, ట్రాలీ కుర్రాడితో ఘర్షణ పడు తోంది. ఆమె చెప్పేది వాడికి తెలియదు. వాడనేది ఆమెకి అర్థం కావ డంలా.

వాడేదో మేకుతో కదిల్చాడు. ట్రాలీ కదిలింది. వెడుతోంది పల్లం లోకి. ట్రాలీ కుర్రాడు నవ్వుతున్నాడు. పరుగెత్తి ఆపుచేసి, దిగమని సంజ్ఞ చేశాడు. ఆమె దిగి ట్రాలీపైకి తోస్తోంది. "రమ్మని" కేక పెట్టింది. బుడ్డి మూసేసి, బాగ్‌లో పెట్టి ముగ్గురం అక్కడికి వెళ్ళాము. ట్రాలీ దిగ మన్నాడు కుర్రాడు. కాసేపు అల్లా అందులో షికారు తిరుగుదాం అంటుంది

కనకం. కుర్రాడిచేతిలో డబ్బుపెట్టాం. నవ్వుతూ ఎక్కమన్నాడు. మేం ముగ్గురం ఎక్కాం. కనకం ముందుగా కూర్చుంది. కుర్రాడు ట్రాలీని ఒక్కగెంటుగెంటి, వెనకాల ఎక్కి, పదం పాడుతున్నాడు. పట్టాలు కొండ దిగువకేసి వున్నాయి. దూరంగా ఒంకరలుతిరిగి,మధ్యలో మాయమైనాయి. అక్కడనుండి, ఇసుక, రాళ్ళు తెచ్చేటందుకు ఆ చిన్న ట్రాలీలైన్ వేశారట, జోరుగా నాలుగుఫర్లాంగులు దిగింది. అక్కడ చదునైన నేలమీద ఐలిపాడు కుర్రాడు. బుడ్లుతీశాం. అందరం తలోకాస్త పుచ్చుగున్నాం.

"కాస్తపుచ్చుగో," అన్నాడు జోగారావు కనకంతో.

"ఇంకానయం. అంత చెడిపోలేదులెండి," అంది కోపంగా.

"మేమంతా చెడిపోయినట్లా! ఏదో సర్దాకి—"అన్నాడు జోగారావు.

"డాక్టరుగారుండే ఒప్పుగున్నారా?"

"ఇదొక మందులాంటిది. అప్పుడప్పుడు, నలుగురూ చేరినప్పుడు. కులాసాగా వుండాలిమరి."

"పండగపూట పాతపెళ్ళామేనా అంటారు," అని నవ్వింది.

"పాత మొగుడేనా అనిసామెత." అన్నాను.

"అదితప్పు. కొత్తదనం కావల్సిన వాళ్ళుమొగాళ్ళు."

"ఆడదిలేందే మొగాడూలేడు గనక, ఇద్దరికీ సరిపోతుందిలే," అన్నాడు జోగారావు.

"కాస్త....ఏది?"

"ఛ, ఛ నాకొద్దుబాబు. మళ్ళా వెనక్కి వెళ్ళాలంటారా. రండి పొద్దుపోతోంది," అంది. ట్రాలీలోకెక్కాం. కుర్రాడు తోస్తున్నాడు. రెండు ఫర్లాంగులొచ్చాం. చీకటి పడుతోంది. పక్షులు గూళ్ళల్లోచేరి కొట్లాడుకుంటున్నాయి. ఏవేవో జంతువుల వింత అరుపులు—కీచురాళ్ళశ్రుతి. కుర్రాడు ఫర్లాంగుతోసి నిలిచిపొయ్యాడు. వాడికాయాసంగావుంది. తోసేవాళ్ళని తీసుకొస్తానని వెళ్ళాడు.

"నడిచిపోదాం" అన్నాడు నాగభూషణం.

"పోనీ మనమే తోద్దాం పట్టండి" అన్నాను.

జోగారావు దిగాడు. ఏంజరిగిందో తెలియదు. చక్రం వెనకపెట్టిన రాయి కదిలిందో, మరేం జరిగిందో, ట్రాలీ క్రిందికి నడవడం మొదలెట్టి, క్షణంలో వేగంగా కదిలిపోతూంది. దాన్ని నిలపలేము. ఇంకా, ఇంకా కిందికి జోరుగా వెళ్ళిపోతూంది. ఇందాక ఆగిన చదును నేలదాటింది. మరో మలుపుతిరిగి, మరీ దిగువున, అతివేగంగా వెడుతూంది. నాకు చాలా థ్రిల్లింగ్‌గా కనబడ్డా, లోపల ఏదోభయం. గట్టిగా ట్రాలీపట్టీలు పట్టుగున్నాం. మలుపులో చదునునేల కనబడుతోంది. ఎట్లాఆపడం? దూకి ముందుకెళ్ళి నిలపాలి, వేగంతగ్గాక. దానికి సిద్ధమవుతుండగా, ట్రాలీ ఒక చక్రంవూడి ముందికిపడి దభాలున నిల్చిపోయింది. త్రుళ్ళిపడి, కిందికిదిగి ఒళ్ళు దులుపుకున్నాం. ఏమీ ప్రమాదం జరగలేదు. ఎవ్వరికీ గాయం తగల్లేదు. బాగా చీకటిగావుంది. నట్టడివి. పట్టాలమ్మటే నడిచివెళ్ళాలి.

"ఆయాసంగావుంది. కాసేపు కూర్చుందాం," అంది కనకం. సరేనన్నాను. నాగభూషణం బుడ్డీతీసి కాస్తపుచ్చుగుని, నాకుకాస్త ఇచ్చాడు. ఆ బుడ్డీ ఖాళీఅయింది. ఖాళీబుడ్డీ వాసనచూసి దూరంగా గిరవాటెట్టింది కనకం. అదిపగిలినచప్పుడు, కీటకాల చప్పుడులో కలిసిపోయింది. అరగంటైంది. ఇంకా నడుద్దాం అన్నాను. పట్టాలమ్మటే నడుచుకుంటూ వెళ్ళాం. మెరక. ఆయాసంగావుంది. అటూ ఇటూ రాళ్ళు, పొదలు. పట్టాలుమధ్యనే అడుగుతీసి అడుగేస్తున్నాం. మరోఫర్లాంగు వెళ్ళాం. కనకం చతికిలపడింది."ఇంక నే రాలేను."

"రాత్రంతా ఈ అడవిలో గడుపుతావా?" అన్నాను.

మళ్ళాలేచింది. మరో అరఫర్లాంగు వెళ్ళాక కూర్చున్నాము. ఏడు దాటింది. దాహంగావుంది. ఎక్కడో ఇందాక కాలవ చూశాము. ఎక్కడ?

జ్ఞప్తికిరావడంలేదు. ఏమీ కనబడడంలేదు. చదును ప్రాంతం చేరుకు న్నాము. అక్కడ దూరదూరంగా వున్నాయి, చెట్లు, రాళ్ళు, పొదలు. అక్కడకూర్చున్నాము, ఎనిమిదైంది. జోగారావు కలిసాడు. జరిగిం దంతా అతనికి చెప్పాము.

"మనం వెళ్ళకపోతే, రైలు వెళ్ళిపోతుందేమో" అన్నాడు.

"ఇంతవరకూ వుంటుందీ? ఈ పాటికి వెళ్ళేవుంటుంది" అంది కనకం, ఒగర్పు ఆపుకుని. పట్టామీద కొప్పు ఆనింది. నేలమీద కాళ్ళు చాచి పడుకుంది.

"నేనింక నడవలేను. చస్తే ఇక్కడే చస్తాను. మామయ్యకి మల్లే స్వర్గానికెడతాను."

"స్వర్గాని కెడతానన్న ధీమా నీకెందుకుండాలి. ధనంజయం అంటే పుణ్యాత్ముడు." అన్నాడు నాగభూషణం.

"నేను పాపాత్మురాలినేలెండి. అందుకే స్వర్గానికెళ్ళే చాన్సుంది. దేవుడికి పాపులంటేనే ఇష్టంటగా!"

ఏదో వోపికలేని నవ్వు.

"ఎక్కడేనా నీళ్ళు దొరుకుతాయేమో చూద్దాం పదండి," అన్నాడు నాగభూషణం.

"ఈ ప్రాంతంలో ఏదో ఒక పాకచూసినట్లు గుర్తు. చూద్దాం పదండి," అని జోగారావు, నాగభూషణం బైలుదేరారు. చెయ్యి పుచ్చుకుని కనకాన్ని లేవదీశాను. మెల్లిగా నడవడం ప్రారంభించింది. వాళ్ళుముందు, మేం వెనకాల. అర ఫర్లాంగు నడిచాం. నాకాళ్ళు తడబడుతున్నాయి. వస్తువులు సరిగ్గా కనబడ్డంలేదు. తల తిరుగుతోంది. ఆమె భుజంమీద చెయ్యి

వేసి అడుగులు వేస్తున్నాను. చతికిల పడిపొయ్యాను. జోగారావుని కేకే సాను. వాళ్ళు ఎటు పొయ్యారో కనబడ్డంలేదు. పక్కన రాయిమీద తలెట్టు గుని పరుంది కనకం. ఎంతసేపైందో తెలీదు. నే కళ్ళు తెరిచేటప్పటికి నా తల కనకం తొడపై ఉంది.

"ఆయాసం తీరిందా. లేవండి. ఆ మైకం తాగడం బట్టి" "నేనేం చేస్తున్నానో నాకు తెలియడంలేదు. ఆమె నడుం గట్టిగా పట్టుగుని వక్షం పైకి ఎగబాకుతున్నాను. ఆమె లేచి చెయ్యి తీసుకుని లేవదీసింది. లేవ తియ్యలేక రొప్పుతోంది. వెడుతోంది. "ఉండు." నిలబడు అని కేకలేస్తూ నడుస్తున్నాను. చాలా దూరం నడిచాము. జోగారావు, నాగభూషణం వచ్చారు కేకలేస్తూ. అక్కడ ఒక గుడిసె ఉందిట. అక్కడ నీళ్ళున్నా యిట. వెడదాం రండి అన్నారు.

"ఎంత దూరం?"

"రెండు మూడు ఫర్లాంగులు."

నడుస్తున్నాం. కాస్సేపు జోగారావు, కాస్సేపు నాగభూషణం నన్ను పట్టుగుంటూ. గుడిసె దగ్గరకి చేరుకున్నాం. అక్కడ ఎవరో ముసిలా డున్నాడు. చీకటి. ఇలాయిబుడ్డి వెలుగు. నీళ్ళు త్రాగారు కనకం, జోగా రావు. మిగిలినకాసినీ నేను త్రాగాను. గుడిసె ముందు పాక. దానిలో గడ్డి గుట్టలు. బ్యాగ్‌లో సీసా తీసి, గబగబ త్రాగేశాను. గడ్డిలో పడిపొయ్యాను. మిగిలింది నాగభూషణం త్రాగేశాడు. సీసా అవతల పారేసింది కనకం.

"ఏమిటి ఇల్లా పడుకుంటే ఎట్లా?" అన్నాడు జోగారావు. ఎవ్వరూ సమాధానం చెప్పరు. పది దాటింది. కళ్ళు మూశాను. ఇంకేమీ గుర్తులేదు. కదిలి కళ్ళు తెరిచాను.

"ఎంతైంది?"

సమాధానం లేదు. వాచ్ చూస్తే కనబడ్డంలేదు. కనకం లేచొచ్చి వాచ్ చూసి, "పన్నెండు" అని, వెళ్ళి పడుకుంది నాగభూషణం పక్కన గడ్డిలో.

ఇక్కడికి రాదేం? నాగభూషణం చెయ్యి ఆమెమీద పడుతోంది. కళ్ళు పెద్దవిచేసి చూశాను. ఆమెను గట్టిగా పట్టుగున్నాడు.

"తాగుమోతు సరసాలు," అని విదిలించుగుని పాకవతల గడ్డి లాక్కొని పడుకుంది. వెళ్ళి ఆమె ప్రక్కనే పడుకున్నాను.

"తలపడతావా?"

నుదురు నొక్కుతూంది. హాయిగా ఉంది. అరచెయ్యి మొహం అంతటా రాసుకున్నాను. జడలో చెయ్యి పెట్టాను. వూడి నా మొహాన పడింది. అందులోంచి ఆకాశం కనబడుతోంది. నక్షత్రాలు మెరుస్తున్నాయి. వక్షంమీద తల ఆనించాను. తొలిగింది.

"నువ్వంటే ఇష్టం" అన్నాను.

"తాగుతున్నారు. నేనంటే కాదు. ఆడది కావాలి. ఎవరో ఒకరు. ఇందిరగారితో చెప్పేదా!" తర్వాత ఏమందో, ఏం జరిగిందో జ్ఞప్తిలేదు. ఎవరో తట్టి లేపుతున్నారు. కనకం అనుకున్నాను. కాదు. ట్రాలీ కుర్రాడు. పక్కన మరో ఇద్దరు మనుషులు. ట్రాలీవాళ్ళు జోగారావు లేచాడు. నాగభూషణంలేచాడు. కనకం పాకలో లేదు. గుడిసెలో మూలగా ముసిలాడి పక్కన చాపమీద పడుకునుంది. లేపాం. నడిచి ట్రాలీ దగ్గరికి చేరుకున్నాం. ట్రాలీ చక్రం బిగించి తెచ్చారు. అందులో ఎక్కాం. స్టేషన్‌కి చేరేటప్పటికి ఆరైంది. ఏడింటికి రైలుట. స్టేషన్‌లో కాఫీ త్రాగాం. కొల్లాన్ చేరేటప్పటికి ఏడున్నరైంది. మా పెట్టెలు సైడింగులో సిద్దంగా ఉన్నాయి.

ం ం ం

తిరుగు ప్రయాణంలో కనకం మాపెట్టెలో ఉండక తప్పిందికాదు. ఆ పెట్టెలో వారు మధ్య మధ్య ఇందులోకొచ్చి దర్శనమిచ్చే అవకాశమూ లేదు. వారంతా ఊటీ, బెంగుళూరు, నాసిక్ వరకూ ప్రయాణం పెట్టు గున్నారట. అందుచేత వాళ్ళ క్యారేజి విడిపోయింది. మేం మదరాసులో ఒకరోజు ఆగాల్సి వచ్చింది. కాని ఎవ్వరికీ వూళ్ళు తిరిగి వినోదించే వోపికలేదు.

"ఏం శ్యామలరావు, అల్లా సినిమాకి వెళ్దాం వెళ్దామా?" అన్నాడు రాఘవయ్య. శ్యామల తనూ వొస్తానంది. సుందరం ఎక్కడికీ వెళ్ళొద్దు, ఐన ఖర్చులు చాలు అని కసిరింది. రక్షితలాల్ వొంట్లో బాగాలేదు. రాజీబాయి సపర్యలు చేస్తోంది. లక్ష్మణమూర్తి తను కొత్తగా కూర్చిన గేయాలు పత్రికల వాళ్ళకి ఇచ్చి వస్తానని వెళ్ళాడు. చౌదరి రిటైరైన వాళ్ళని మళ్ళా పనిలోకి తీసుగునే కొత్త రూల్సు ఏమన్నా ఉన్నాయేమో తెలుసుగుని వొస్తానని వెళ్ళాడు.

చెట్టిగారు, భార్య చిట్టిమ్మ, చెల్లాయి పెండ్లి సంబంధం చూసొస్తామని వెళ్ళారు. నాగభూషణం, భార్య హాయిగా రెస్టు తీసుకుంటామన్నారు. జాలయ్య మూర్ మార్కెట్కి వెళ్ళి, పర్సు పోగొట్టుకుని, తిరిగొచ్చిదిగులుగా కూర్చున్నాడు. జోగారావు, పద్మనాభం, శంకరం పేకముందేసుకుని నాలుగో చెయ్యిగా వితలయ్యని రమ్మని అడుగుతున్నారు. కనకం నిద్రపోయింది — చెవులకి పెద్దగా వ్రేలాడే కమ్మలు తగిలించుకుని. మర్నాడు రైలు బైలుదేరింది. ఇంక మరో గంటలో బైలుదేరిన చోటుకి చేరుతుంది. మా యాత్ర అంతటితో ముగింపవుతుంది. ఐదైంది. ఆ స్టేషనులో టిఫిన్ తిని, కాఫీ త్రాగాను. ప్రయాణం ఖర్చు వ్రాసుకుంటున్నాను. రైలు కదిలింది. కునుకొచ్చి, కళ్ళుమూశాను. ఎవరో భుజంతట్టి లేపారు. చూస్తినికదా కనకం. వెనక్కి జరిగి, కూర్చోమన్నాను.

"ఏం – విశేషం?"

"కష్ణమూర్తిగారు అడ్రెస్ ఇచ్చారు. ఈ పాతిక మనియార్డర్ వ్రాసి పెడతారా?" అంది.

"అప్పుగా తీసుకున్నావా?"

"ఏదైతే ఏం లెండి."

"నువ్వు తిరిగి రొక్కంగా ఇవ్వడం విశేషమే."

"ఇంకెల్లాగిస్తారు?"

"ఇచ్చినవారు డబ్బు రూపేణ ప్రతిఫలం కోరరుగా" అన్నాను.

"మీ తికమకలు నా కర్థంకావులెండి. సూటిగా అడగరాదు. నా సావాసంవల్ల మీరందరూ పాడయ్యారు. నేనదివ్వడానికి సిద్ధంగా ఉన్నానని తెలిసి అది అడగడం బాగుండదని మానేసిన మర్యాదస్తులు. డబ్బు తీసుగుంటే అదివ్వాలని తీసుకోడం మానేసి, నేనూ మీవల్ల పాడయ్యాను".

ఇదంతా నాకు తికమకగానే తోచింది. ఆమె కళ్ళల్లో ఒక వెలుగు, దైన్యం రేఖ మెరుస్తోంది. ఉప్పునీటి స్నానాలకి మొహం బాగా కడగబడి, పవిత్రమైనట్లుంది చర్మం.

"నాకో సందేహం – చాలారోజుల్నుంచి, అడిగెయ్యనా?" అన్నాను

"దాచకండి. అనుమానం ప్రాణసంకటం, అన్నారు."

"నువ్వెంతమందిని చూశావుకదా –"

"అంటె"

"ఇప్పుడు కాదులే - వెనక. అన్ని రకాలవారిని చూశావుకదా— పోనీ, ఇప్పుడనుకో—నీ వ్యూహలో నిజంగా, నీకు నచ్చి, నువ్వు మన

సారా ప్రేమించి, వాంఛించి, ఎప్పుడూ వారితోనే ఉండిపోవాలి—మరొకరి సంపర్కం లేకుండా — వాళ్ళు ఒక్కళ్ళతోటే, ఎల్లప్పుడూ బంధం ఏర్పరచుకుని గడపాలి—అనే వ్యక్తిని ఎరుగుదువా?" అన్నాను.

"సూటిగా అడగలేరూ? పెళ్ళి చేసుకునేందుకు తగిన మొగాడు దొరికాడా అనా?" అంది.

"అంతేకాదు. పెండ్లయినా, కాకపోయినా, నే నితన్ని ప్రేమించాను ఇతనే ఆదర్శపురుషుడు. ఇతనిలో ఐక్యమైపోతాను-అంత గాఢంగా వాంఛించిన వ్యక్తిని ఎరుగుదునా అని ప్రశ్న" అన్నాను.

"ఓ, ఎరుగుదును."

"ఎవరు ?"

"భగవంతుడు" అంది క్రమమైన పళ్ళవరస కనపరుస్తూ. ఆ క్షణంలో నే నామెని ద్వేషించలేదు. ప్రేమించానేమో కూడా !

o o o

యాత్రకి వెడుతున్న కొందరి మిత్రులను, ప్రయాణం విశేషాలు, వారి వారి అనుభవాలు, వింతలు, ఆయా ప్రాంతాల నుండి వ్రాయమని కోరాను. కొందరు వ్రాశారు. మరికొందరు యాత్ర నుండి తిరిగొచ్చాక స్వయంగా చెప్పారు. ఇవన్నీ గుచ్చెత్తి, వారి భాషలో బూతునీ, పచ్చిగా చెప్పిన వాటినీ, అతిశయోక్తితో ప్రకటించిన మానసిక స్థితినీ విడిచేసి, శైలిని మార్చి చిత్రిక పట్టగా ఏర్పడిన రచన ఇది. కథకి ముగింపు ముఖ్యమంటారు. దీనికి మనస్సులో నిల్చిపోయే ముగింపు లేదు. ధనం

జియంగారి ఆస్తిలో కొంతభాగం వారి కొడుకులు కనకానికి వ్రాసి ఇచ్చిన ఉదంతం జరిగి ఉంటే కథకి మంచి ముగింపు సమకూరేది. వారి కొడుకులు అల్లా చేసినట్లువినలేదు. చిత్రకారుడు రామనాథం శ్యామలని వివాహమాడినట్లూ వినలేదు. కాని, పెళ్ళి మాటలు సాగుతున్నాయిట. కొంత మెరుగు. కథంతా చదువుకుని, దీనిలో విగూఢమైన వ్యాఖ్యానం, ప్రయోజనం ఏమన్నా ఉన్నాయా అనుకుంటే,శ్యామలరావు చివర చెప్పినదాంట్లో, చివరి వాక్యాల్లో ఇమిడి ఉన్నది మినహాయిస్తే, నా కింకేమీ కనబడలేదు. ఇంత కథ చదివి, ఆ కాస్త వ్యాఖ్యానంతో పాఠకుడు తృప్తిపడితే ఈ రచన వృథా అనుకోను.

ప్రచురణ - భారతి 1963 జనవరి, ఫిబ్రవరి సంచికలలో.